జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

**కావలెను**
రాష్ట్ర వ్యాప్తంగా నూతన శకాన్ని లిఖించబోతున్న
**పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి**
ఆంధ్రప్రదేశ్ 175 నియోజకవర్గాల నుంచి 175 మంది వాలంటీర్స్ ని నియమిస్తుంది.
ప్రతి వాలంటీర్ కు
నెలకు Rs.25,000/-
Salary ఇవ్వబడును.
విద్యా, వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా వాలంటీర్ గా చేరవచ్చు.
ఆసక్తి గలవారు మీ బయోడేటాను ఆధార్ కార్డు తో సహా
మీ ప్రాంతంలో ఉన్న పార్క్ లీడర్స్ ని సంప్రదించవచ్చు.
లేదా ఈ క్రింది నెంబర్
7660027683 కి వాట్సాప్ చేయగలరు.

సంపుటి 15 సంచిక 280 విశాఖపట్నం | బుధవారం 07 జూన్2023 | 8 పేజీలు | వెల : 5.00

# పోలవరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి..

## పనులను పరిశీలించిన సీఎం జగన్



ఏలూరు : పోలవరాన్ని అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, నిర్వాసితుల పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆంధ్ర రాష్ట్రానికి జీవనాడైన పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించిన అనంతరం అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ప్రాజెక్ట్ అధికారులు ఇంజనీర్లు ప్రాజెక్టు నిర్మాణ పనులను సమగ్రంగా ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను సైతం ఆయన పరిశీలన జరిపి తదుపరి సంభంధిత అధికారులతో సమగ్రంగా సమీక్ష జరిపారు. ఇటీవల కేంద్ర జల వనరుల శాఖ మంత్రి గజేంద్ర షెకావత్ ఆధ్వర్యంలో జల శక్తి సంఘం 2025 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని ఆదేశించిన నేపథ్యంలోనూ పనులను పూర్తిచేసేందుకు గాను 12911 కోట్ల రూపాయల నిధులను విడుదల చేసేందుకు కేంద్రం ఆమోదించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఏరియల్ సర్వే ఫోటో ఎగ్జిబిషన్ క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సంబంధిత ఇంజినీర్లు అధికారులతో సమీక్షించారు. ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్ దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ వద్ద జరుగుతున్న పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. గత సీజన్లో అనూహ్యంగా వచ్చిన వరద విపత్తులు తట్టుకునేందుకు ఎగువకాఫర్ డ్యాం ఎత్తు పెంపు పనులను సైతం ఆయన పరిశీలించారు. అలాగే ఇటీవల నిర్మాణం పూర్తి చేసుకున్న దిగువ కాఫర్ డ్యాంను కూడా ముఖ్యమంత్రి పరిశీలించారు. వైబ్రో కాంప్లెక్స్ పనులను డయాఫ్రమ్ వాల్ ప్రాంతంలో నిర్మాణ పనులను ఈసీఆర్ఎఫ్ డాం నిర్మాణాలపై నా అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు తొలివిడత ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు అవసరం అయిన నిధులను ఇచ్చేందుకు కేంద్రం అంగీకారం తెలిపిందని 12,911.15 కోట్లు విడుదల చేసేందుకు కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు అధికారులు వివరించారు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్ ప్రాంతంలో నిర్మాణాల కోసం అదనంగా మరో రెండు వేల కోట్లు ఇచ్చిందని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. కాంపౌండ్ వారీ బిల్లులు చెల్లింపు వల్ల ప్రాజెక్ట్ నిర్మాణాలు ఆలస్యం అవుతున్న విషయాన్ని పరిగణలోకి తీసుకొని కేంద్రం మినహాయింపులు కూడా ఇచ్చిన విషయాన్ని వివరించారు. గైడ్ వాల్ దెబ్బతిన్న విషయం పై సమీక్ష నిర్వహిస్తూ గైడ్ వాల్ డిజైన్లను కేంద్ర జల సంఘం సి డబ్ల్యూ సి ఖరారు చేసిందని వారి ఆమోదంతోనే పనులు చేశామని అధికారులు వెల్లడించారు. కేంద్రానికి పరిస్థితులను నివేదించామని దీన్ని సరిదిద్దడం పెద్ద సమస్య కాదని సిడబ్ల్యూసి పరిశీలన కాగానే వారి సూచనలు మేరకు మరమ్మతులు చేపడతామని అధికారులు తెలిపారు. **(మిగతా 6లో..)**



## తొలకరిలో రైతుకు అదృష్టం..

**పొలంలో రూ. 2కోట్ల విలువైన వజ్రం లభ్యం..**

కర్నూలు: ఎక్కడైనా తొలకరి వర్షాలు కురవడం ప్రారంభమయ్యాయంటే అన్నదాతలు వ్యవసాయ పనులు మొదలు పెడతారు. సాగుకు ఏర్పాట్లు చేస్తుంటారు. అయితే కర్నూలు జిల్లాలో మాత్రం అలా కాదు.. తొలకరి వర్షాలు ప్రారంభమయ్యాయంటే చిన్నాపెద్దా తేడా లేకుండా జనం పొలాల బాట పడతారు. అయితే, వ్యవసాయ పనుల కోసం మాత్రం కాదు.. వజ్రాల వేట కోసం. అవును, వజ్రాల వేటే. రాయలసీమలోని పలు జిల్లాల్లో ఏటా ఈ సీజన్ లో ఇది సాధారణమే. అయితే తాజాగా కర్నూలు జిల్లాలో ఓ రైతు పంట పండింది. పొలం పనులు చేస్తుండగా వజ్రం దొరికింది. తుగ్గలి మండలం బసనేపల్లిలో పొలం పనులు చేస్తుండగా ఓ రైతుకు వజ్రం దొరికింది. ఈ విషయం తెలుసుకున్న వ్యాపారులు వజ్రం కొనుగోలు చేసేందుకు పోటీపడ్డారు. **(మిగతా 6లో..)**

# మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన అల్లర్లు..

## అప్పటి వరకూ ఇంటర్నెట్ బంద్!





ఇంఫాల్: మణిపూర్‌లో మరోమారు అల్లర్లు చెలరేగాయి. సోమవారం రాత్రి సెరౌ ప్రాంతంలో శాంతిభద్రతలు నెలకొల్పడానికి అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, పోలీస్ బలగాలు పెద్ద సంఖ్యలో మోహరించాయి. ఆ సమయంలో భద్రతా దళాలు, నిరసనకారుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు అస్సాం రైఫిల్స్ సిబ్బందికి బుల్లెట్ గాయాలవగా, ఒక బీఎస్ఎఫ్ జవాన్ మృతి చెందినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. గాయపడిన అస్సాం రైఫిల్స్ సిబ్బందిని మంత్రిపుఖ్రీకి తరలించినట్లు మీడియాకు తెలిపారు. మణిపూర్‌లోని సెరు, సుగ్నూ ప్రాంతంలో జూన్ 5 అర్ధ రాత్రి సమయంలో తిరుగుబాటుదారులు, భద్రతా దళాల మధ్య కాల్పులు జరిగాయి. ఈ దాడులను భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. శనివారం నుంచి మణిపూర్‌లోని కొండలు, లోయ ప్రాంతాల్లో ఏరియా డామినేషన్ కార్యకలాపాలను ఆర్మీ, అస్సాం రైఫిల్స్, పోలీసులు ప్రారంభించారని భద్రతను పర్యవేక్షిస్తున్న సైన్యానికి చెందిన స్పియర్ కోర్ కమాండ్ తెలిపింది. అల్లర్ల దృష్ట్యా మణిపూర్‌లో ఇంటర్నెట్ బ్యాన్‌ను జూన్ 10 వరకు పొడిగిస్తున్నట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

# ఏపీలో పవన్ కల్యాణ్ దూకుడు..

## ప్రచారపర్వం ప్రారంభం వెనుక రెండు కారణాలు.. పొత్తు పొడిస్తే జరిగేది ఇదేనా?



అమరావతి, ఏపీలో పొలిటికల్ హీటు పెరుగుతోంది. ఎన్నికలకు పది నెలల ముందుగానే జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన ప్రచార రథానికి పని పెట్టారు. వారాహిపై ఏపీ వ్యాప్త పర్యటనకు తేదీ ఖరారు చేశారు. జూన్ పద్నాలుగో తేదీన వారాహి రోడ్డెక్కబోతోంది. తనకు కలిసి వచ్చే సామాజిక సమాకరణాలు, అవకాశాలున్నయని భావిస్తున్నందు వల్లే ఉభయ గోదావరి జిల్లాల్లోనే పవన్ కల్యాణ్ తొలి విడత పర్యటనకు దిగుతున్నారు. అన్నవరం సత్యదేవుని సన్నిధిలో పూజాధికాలు నిర్వహించిన తర్వాత తుని నుంచి వారాహిపై ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టాలని జనసేనాని తీర్మానించారు. రొటీన్ ప్రచారంలా కాకుండా ప్రజలతో మమేకమవుతూ, సాయంత్రాలు స్ట్రీట్ మీటింగుల్లో మాట్లాడుతూ.. అడపాదడపా బహిరంగ సభలను నిర్వహించేలా వారాహి యాత్రను ఖరారు చేశారు. దానికి అనుగుణంగా యాత్రకు ఇంఛార్జీలను నియమించారు. ఇంత ముందుగానే పవన్ కల్యాణ్ ప్రచారాన్ని ప్రారంభించడం వెనుక రెండు కారణాలు కనిపిస్తున్నాయి. **(మిగతా 6లో..)**

# ఎన్టీఆర్ జిల్లా అధికారులపై కేంద్ర మంత్రి ఫైర్



ఎన్టీఆర్ జిల్లా: ఎ.కొండూరు మండలంలో కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవర్ పర్యటించారు. ఏ.కొండూరు డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించి కిడ్నీ బాధితుల సమస్యలు, అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం పీఎం కిసాన్ పథకంపై అక్కడే ఏర్పాటు చేసిన రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై కేంద్రమంత్రి సీరియస్ అయ్యారు. అలాగే ఎ.కొండూరులో తాగునీటి సరఫరాపై లంబాడి తండా వాసులతో నేరుగా మాట్లాడి ఆరా తీసారు. రెండు రోజులకు ఒకసారి నీళ్లు వస్తున్నాయని తెలిపారు. దీంతో అక్కడే ఉన్న అధికారిని వివరణ కోరగా తాగునీటి ఇబ్బంది లేదు అనడంతో కేంద్ర మంత్రి ఒక్కసారిగా సీరియస్ అయ్యారు. 'మీరు జూట్ బోల్తా'... అంటూ అధికారి అంటూ తీవ్ర స్వరంతో కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను మందలించారు. ఎ.కొండూరులో డయాలసిస్ వ్యాధి గ్రస్తులు పెరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని కేంద్ర మంత్రి ప్రశ్నించారు.

# ఒడిశా రైలు ప్రమాదంలో వెలుగులోకి షాకింగ్ నిజాలు..

## '40 మృతదేహాలపై కనిపించని గాయాలు'



భువనేశ్వర్: ఒడిశా రైలు ప్రమాద దుర్ఘటన యావత్ దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఒడిశాలోని బాలాసోర్ వద్ద మూడు రైళ్లు ఒకదానికొకటి ఢీ కొన్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో రెండు రైళ్లకు చెందిన బోగీలు బోల్తా పడ్డాయి. దాదాపు 278 మంది మృతి చెందగా.. 1100లకు పైగా గాయాపడ్డారు. అనేక మృత దేహాలు గుర్తుపట్టలేనంతగా మారిపోయాయి. ఈ ప్రమాదంపై నిర్వహించిన రెస్క్యూ ఆపరేషన్‌లో పలు షాకింగ్ విషయాలు బయటకు వస్తున్నాయి. ప్రమాదానికి గురైన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ నుంచి వెలికితీసిన 40 మృత దేహాలకు ఎటువంటి గాయాలు కాలేదు. ఎక్కడా కనీసం రక్తస్రావం అయిన ఆనవాళ్లు కూడా లేవని రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్న ఓ ఉన్నత పోలీసు అధికారి తెలిపారు. ప్రమాద సమయంలో లైవ్ ఓవర్ హెడ్ వైర్లు తెగి బోగీలపై పడటంతో వారంతా విద్యుదాఘాతంతో మరణించి ఉంటారని, ఓవర్‌హెడ్ విద్యుత్ వైర్లు తెగిపడిన కొన్ని సెకన్లలోనే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉందని ఈస్ట్ కోస్ట్ రైల్వే చీఫ్ ఆపరేషన్స్ ఎక్స్ మేనేజర్ పూర్ణ చంద్ర మిశ్రా అభిప్రాయపడ్డారు. హౌరా-చెన్నై కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ (బెంగళూరు)-హౌరా ఎక్స్‌ప్రెస్‌లకు గత శుక్రవారం సాయంత్రం 6.55 గంటలకు జరిగిన ప్రమాదంలో ఓవర్‌హెడ్ వైర్ తెగి రైలు బోగీలపై పడి ఉంటుందని, షాక్‌కు గురై చాలా మంది మరణించినట్లు సబ్-ఇన్‌స్పెక్టర్ పాపు కుమార్ నాయక్ ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. ఓవర్‌హెడ్ ఎల్‌టి (తక్కువ టెన్షన్) లైన్ వైర్లు కారణంగా చాలా మంది ప్రయాణికులు గాయపడ్డట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. 'ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్'లో పనిచేసే వ్యక్తుల నిర్లక్ష్యం మూలంగా ఈ ప్రమాదం సంభవించిందని కేసు నమోదైంది. మరోవైపు ఈ కేసు దర్యాప్తుకు డీఎస్పీ ర్యాంక్ అధికారి నేతృత్వంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. సీబీఐ బృందం సోమవారం రాష్ట్రానికి వచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా ఎఫ్ఐఆర్‌లో నిందితుల పేర్లు పేర్కొనకపోవడం విశేషం.

**మాస్టర్ కీ TV**
Jai B Bhoomi News Channel Limited
CIN NO: U74999TG2018PLC128263

**మాస్టర్ కి టీవీ ఛానల్ లో డైరెక్టర్స్ ని ఈ క్రింది విభాగాల నుంచి తీసుకొనబడును**

1. ప్రతి కులం నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
2. ఒక్కొక్క డిపార్ట్ మెంట్ నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
3. సమస్యల గురించి పోరాడే ఒక్కొక్క సోషల్ విభాగం నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
4. మైనార్టీస్, ముస్లిం, క్రిస్టియన్, బుద్దిస్ట్ మొదలగు వారి నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
5. అభ్యుదయ వాదుల నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
6. ఒక్కొక్క పార్లమెంట్ నుంచి లేక జిల్లా నుంచి ఒక్కొక్క స్టాఫ్ రిపోర్టర్ ని తీసుకొనబడును.
7. మహిళలు & N.G.O ల నుండి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
8. యూత్ సంఘాల నాయకులను ఒక్కరు లేక అంతకుమించి ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
9. కార్మిక సంఘాల నాయకులను ఒక్కరు లేక అంతకుమించి నాయకులను తీసుకొనబడును.

**ఇంకా మీకు తెలిసిన విభాగాలను తెలియపరచగలరు**

**డాక్టర్ కె.శివ భాగ్యారావు బహుజన్, IRS-vrs**
చైర్మన్ మాస్టర్‌కీ టీవీ ఛానల్
(జై బి భూమి న్యూస్ ఛానల్ లిమిటెడ్)

# "సివిల్ రైట్స్ డే నిర్వహించకుండా, దళితులు ప్రభుత్వాన్ని వ్యతిరేకించేలా చేస్తున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి "

## ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం



బాపట్ల, ప్రజాపాలన ప్రతినిధి: సమాజంలో కుల నిర్మూలన అనే అంశం మరుగున పడిపోయి, కులపరమైన అకృత్యాలు పెరిగిపోవడానికి ప్రధాన కారణం ప్రభుత్వ అధికారుల అలసత్వం, నిరంకుశ ధోరణులు, నిర్లక్ష్యం కారణాలని... అలాంటి అధికారుల మీద చట్టపరమైన చర్యలు తీసుకుని, సమగ్రంగా సామాజికపరమైన సివిల్ రైట్స్ డే వంటి సత్సంగ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినప్పుడే నిజంగా ప్రభుత్వానికి దళితుల పట్ల మరియు కుల నిర్మూలన పట్ల చిత్తశుద్ధి ఉన్నది అని చెప్పవచ్చును. ఎప్పటికప్పుడు కుంటి సాకులు చెబుతూ సివిల్ రైట్స్ డే, నియోజకవర్గం స్థాయి కుల నిర్మూలన సదస్సులు, ప్రత్యేక ఎస్సీ ఎస్టీ గ్రీవెన్స్ డే లు నిర్వహించడం మానేశారు. ఈ కార్యక్రమాలు మండలంలో అయితే మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అయిన తహసీల్దారు, డివిజన్ స్థాయిలో అయితే సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఆయన ఆర్డిఓ లేదా సబ్ కలెక్టర్, జిల్లా స్థాయిలో అయితే జిల్లా మేజిస్ట్రేట్ లేదా జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో ఆయా స్థాయిలలో పనిచేసే అన్ని డిపార్ట్మెంట్ల అధికారులు తప్పనిసరిగా హాజరు అయ్యేలా, ఈ కార్యక్రమంలో అన్ని కులాల వారు మతాలవారు పాల్గొనే విధంగా దండోరా వేయించడం ద్వారా సమాచారాన్ని ఇవ్వాలి. సమావేశం నిర్వహించాల్సిన నెల చివరి రోజు సెలవు రోజు అయితే ఆ ముందు రోజు అయినా ఆ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలి. ఆ కార్యక్రమంలో కేవలం రేషన్ కార్డులు, పింఛన్లు సకాలంలో అందుతున్నాయా లేదా అనే ప్రశ్నలు వేసి తూతూ మంత్రంగా కార్యక్రమాన్ని ముగించి వేయడం ఇకనైనా మానాలి. గ్రామంలోని ప్రజలందరూ ఒకే చోట కుర్చీలలో గాని, లేదా చాపల మీద గాని సమానంగా ఒకే విధంగా కూర్చునేలా చర్యలు తీసుకొని, ఎస్సీ ఎస్టీ ఆక్ట్ గురించి, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాను ల గురించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరంగా వారికి తెలియజేయాలి. కుల నిర్మూలన అనే అంశము సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా అర్థం చేసుకొని, కుల నిర్మూలన కోసం కృషి చేసేలా, పౌరుల హక్కుల కోసం ప్రభుత్వాధికారులను సైతం నిలదీసేలా... ఆ సమావేశంలో అధికారులు వివరంగా ప్రజలకు తెలియజేయాలి. ఈ సమావేశాలకు గైరు హాజరయ్యే అధికారులకు చార్జిషీట్ ఇచ్చి వారి మీద చర్యలు గైకొనాలి. ఇలాంటి కార్యక్రమాల పైన శ్రద్ధ చూపని ఏ జిల్లా అధికారి కూడా తాను సమర్థవంతంగా జిల్లాను నడిపినానని భావించేందుకు ఏమాత్రం అవకాశం లేదని ఈ సందర్భంగా ప్రకటిస్తున్నాము.

దళితులకు సంబంధించిన ఈ సంక్షేమ సమావేశాలను నిర్లక్ష్యం చేస్తే జూన్ మాసంలో తప్పకుండా పోరాటాలు చేయడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు నక్కా కాంతారావు ప్రకటించారు

# నాలుగూళ్లకు ఒక్కరే కార్యదర్శి..

## పది మంది ఉన్నా ఫలితం శూన్యం.... సమస్య పరిష్కారమయ్యేది ఎలా..?





గోకవరం, ప్రజా పాలన జూన్ 6: ప్రజల వద్దకు పరిపాలన చేరువ చేసి ప్రజలకు మెరుగైన ఫలితాలు అందే విధంగా సేవలందించాలన్న లక్ష్యంతో ఓవైపు ప్రభుత్వ నిర్ణయాలు అమలవుతుండగా, గోకవరం మండలంలో అందుకు భిన్నంగా పాలన సాగుతుంది. గ్రామ సచివాలయ వ్యవస్థ వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం భావిస్తుంటే క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యల పరిష్కారానికి అక్కడి విధులు నిర్వర్తించే కొంతమంది నిర్లక్ష్యం నిలువుటద్దంగా దర్శనమిస్తుంది. ప్రతి గ్రామ సచివాలయంలో ప్రభుత్వం నియమించిన పదిమంది ఉద్యోగులతో పాటు అక్కడి జనాభా, ఇళ్లు ప్రాతిపదికగా గ్రామ వార్డు వాలంటీర్లను నియమించి ప్రజాసేవలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం ఆశించిన రీతిలో అమలు కావటం లేదు. కనీసం చేతిపంపు మత్తులకు వచ్చిన పట్టించుకునేవారు కరువయ్యారు. త్రాగునీటి సమస్య పారిశుధ్య సమస్య ఇలా గ్రామాల్లో ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి. ఎన్నికైన పాలకులు నిధులు లేవని చేతులెత్తేస్తున్నారు. పట్టించుకునే అధికారులు పాలన సాగించేందుకు తలకు మించిన భారంతో ఉన్నతాధికారి నుండి వచ్చే ఆదేశాలు అమలు చేయడంలో పని ఒత్తిడికి గురవుతున్నారు. అందులో భాగంగా ఈమండలంలో నాలుగు గ్రామాలలో ఉన్న ఐదు సచివాలయాలకు ఒక్కరే పంచాయతీ కార్యదర్శి బాధ్యతలు నిర్వర్తిస్తుండటంతో ప్రభుత్వం ఆశించిన ఫలితాలు నేతి బీర చందంగా మారాయి. ప్రధానంగా కామరాజుపేట గ్రామపంచాయతీ పరిధిలో జగన్నాధపురం, కామరాజుపేట గ్రామాలలో రెండు సచివాలయాలు ఉండగా, రంపఎర్రంపాలెం గ్రామపంచాయతీ పరిధిలో రెండు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అదేవిధంగా అచ్యుతాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఒక్క గ్రామసచివాలయం ఉండగా వీటన్నిటికీ ఒక్కరే పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతేకాకుండా నైసర్గికంగా ఈనాలుగు గ్రామాలు వేరువేరు ప్రాంతాలలో ఉండటంతో బాధ్యతలు నిర్వర్తించే కార్యదర్శికి తలకు మించిన భారంగా అవుతుంది. అయితే అచ్చుతాపురం గ్రామం పంచాయితీ పరిధిలో అన్ని సమస్యలే వెంటాడుతున్నాయి. మండువేసవిలో ప్రతి ఇంటికి నీటి అవసరం ఉన్న పరిస్థితులలో త్రాగునీటి సరఫరా నిత్యం ఆటంకాలతో ప్రజలను తీవ్ర వేదనకు గురిచేస్తుంది. ఈగ్రామంలో అయితే డ్రైనేజీ వ్యవస్థ పూడికలుకు పెరిగిపోయి, దుర్గంధ భరితంగా తయారవ్వడంతో దోమలు పెరిగి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించే పరిస్థితి కానరావడం లేదు. గ్రామ సచివాలయానికి సోమవారం సాయంత్రం జరిగే స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన దరఖాస్తు దారుల పట్ల అచ్చుతాపురం సచివాలయంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ దురుసుగా వ్యవహరించడం జరుగుతోంది. విధి నిర్వహణలో డిజిటల్ అసిస్టెంట్ నిర్లక్ష్య ధోరణిపై ఉన్నతాధికార్లు తనిఖీ నిర్వహించాలని కోరారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని గ్రామ పంచాయతీ పరిధిలో తలెత్తే ప్రజాసమస్యలు పరిష్కారం కోసం భాగస్వామ్యం చేయాలని జనం కోరుతున్నారు.

## పోలవరం ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంతో హర్షం వ్యక్తం చేసిన జ్యోతుల నెహ్రూ



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి : స్థానిక రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ బహుళార్థక సాధక ప్రాజెక్టు పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం 12 వేల కోట్లు నిధులు సమకూర్చడంతో చాలా సంతోషమని కానీ ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను పక్కదారి మల్లించకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఉపయోగించాలని లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుని పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఆ నిధులను వెచ్చించేలా చూడాలన్నారు. లేదంటే గ్రామపంచాయతీ నిధులు, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఏ విధంగా అయితే దారి మళ్ళించి వేరే పథకాలకు వాడారు. అదే విధమైన పరిస్థితి ఈ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తుందని అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఈ ముఖ్యమంత్రి నాలుగు సంవత్సరాల కాలంలో పోలవరం ప్రాజెక్టు నాలుగు సార్లు సందర్శించారని గత టిడిపి ప్రభుత్వంలో అనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు 71 సార్లు పరిశీలించి 75% పనులు పూర్తిచేస్తే ఈ ప్రభుత్వం ఏడు శాతం పనులే పూర్తి చేయటం పోలవరంపై ఎంత సిద్ధ శుద్ధి ఉందో తెలుస్తుందన్నారు. కాపర్ డాం, డయాఫ్రం డాం వరదల్లో కొట్టుకుపోతే రాజకీయం చేశారు తప్ప పటిష్టమైన చర్యలు తీసుకున్న పాపాన పోలేదని ఆఖరుకు ఈ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నాకు ఈ ప్రాజెక్టు పై అవగాహన లేదని చేతులెత్తేయడం చూస్తుంటే ఈ ప్రభుత్వ చెత్తశుద్ధి ఎంత ఉందో అర్థమవుతుందని ఇప్పటికైనా పోలవరం ప్రాజెక్టు ఎత్తు 41% కాకుండా 45 శాతం పూర్తి చేయాలని లేదంటే పుష్కర తాడిపూడి ఎత్తిపోతల పథకాలకు నీళ్లు ఇచ్చే విధంగా ఉంటుంది తప్ప బహులార్ధక సార్థక ప్రాజెక్టుగా ఉండదని అన్నారు. ఈ 12 వేల కోట్ల నిధులతో పోలవరం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిర్మించాలని లేదంటే మళ్లీ ప్రజా ఉద్యమాలు మొదలవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్తకొండ బాబు, పిలా మహేష్, వేములకొండ జోగారావు నే దూరి గణేష్, కొండ్రోతు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నిమ్మల, సిపిఎం నేతల అరెస్టులపై నిరసన




నరసాపురం, జూన్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) : యలమంచిలి మండలం చించినాడలో దళితులకు అండగా నిలిచిన పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, సిపిఎం నేతల అరెస్టుపై టీడీపీ, సీపీఎం శ్రేణులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ సెంటర్లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రావణరాజ్యం రాజ్యమేలుతోందని విమర్శించారు. జగన్ ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు చరమగీతం పాడనున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అక్రమ అరెస్టును ఖండించారు. రాష్ట్రంలో మున్నెన్నడూ లేని విధంగా నిర్బంధాలు పెరిగాయని ఈ ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరన్నారని విమర్శించారు. సీపీఎం నాయకుడు ముచ్చెర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ దళితులకు భూములిచ్చి రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వ పెద్దలు వారి భూములు కైంకర్యం చేయడం శోచనీయమని అన్నారు. దళితులకు అండగా నిలచిన పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడును అరెస్టు చేసి ప్రభుత్వం మరో తప్పు చేసిందని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పాలూరి బాబ్జీ, తెదేపా సీనియర్ నాయకులు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, పొన్నాల నాగబాబు, సంకు భాస్కర నాయుడు, తిరుమాని శశీదేవి, పెమ్మాడి శ్రీదేవి, భోగిరెడ్డి ముత్యం, నంద్యాల భాస్కర్, సిపిఎం నేతలు తెలగంశెట్టి సత్యనారాయణ, పొగాకు నారాయణ రావు, పొన్నాడ రాము, బూడిద జోగేశ్వరరావు, రామలింగం, బోడశింగు అప్పారావు, పున్నాని అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 9ఏళ్ళ బిజెపి పాలన అద్భుతం: బిజెపి జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ



గుడివాడ : ప్రదాని నరేంద్రమోడీ 9 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులకు సన్మానించుకోవడ అదృష్టమాని జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు అన్నారు. మంగళవారం స్థానిక బిజెపి కార్యలయంలో పట్టణాధ్యక్షుడు యర్రపోతు అర్జున్ అధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోడి 9పాలన పూర్తి అయిన సందర్బంగా పులువురు బిజెపి సినీయర్ నాయకులు ఆలమూరి మురళీకిష్ణ, శలంకాయల మురళీకిష్ణ, శీలం శంకర్రావు, పురిహెళ్ళ శ్రీనివాసరావులను ముఖ్య అతిధులు జిల్లా ఇన్చార్జి వి.కబర్థి జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పార్టీలో ఎన్నో సంవత్సరాలుగా ఏమీ ఆశించకుండా పార్టీకి సేవలు చేసిన వారిని గౌరవిచడం మన భాధ్యత అన్నారు. పార్టీ ఆవిర్భానికి ముందు నుంచీ దేశభక్తి పునికి పుచ్చుకొని నిబద్ధత కలిగిన నాయకులు ఒక్క భారతీయ జనతా పార్టీలోనే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రవాస్ యోజన ఇంచార్జ్ సూరే లక్ష్మీనారాయణగాంధీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, మహిళా మోర్చ అధ్యక్షురాలు శలంకాయల లీలాకుమారి, జిల్లా ఉపాధ్యక్షులు వలపర్ల వెంకటేశ్వరరావు, నాయకులు కొత్త కిరణ్, జనార్ధన్ తదితర పాల్గొన్నారు.

## పుర అభివృద్ధి పై దృష్టి: ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి



కావలి జూన్ 6 (ప్రజాపాలన) :కావలి మున్సిపాలిటీ అభివృద్ధి పై దృష్టి సారించాలని ఎమ్మెల్యే అధికారులు కు వివరించారు. స్థానిక మున్సిపాలిటీ అధికారులు తో సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ కిరణ్, ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. సమస్యలను , పరిష్కరించాలని, అలాగే ఎక్కడైనా సమస్యలు ఎదుర్కొంటున్న పుర ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్య లను పరిష్కరించేవిదంగా చర్యలు తీసుకోవాలని వివరించారు. అమృత పథకం లో నిధులతో పైపులైన్ లను ప్రతిష్టాత్మకగా పూర్తి చేయాలని అధికారులకు వివరించారు. నూతన కమిషనర్ కు వార్డు ఇంఛార్జి లు, సచివాలయ సిబ్బంది సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఏఈ, సాయిరాం టౌన్ ప్లానింగ్ అధికారి బాబురావు , సిబ్బంది, వైసీపీ నాయకులు, కుందుర్తి కామయ్య, వడ్లమూడి, వెంకటేశ్వర్లు, శ్యాంసన్, తదితరులు పాల్గొన్నారు.

## 30వ రోజుకు వేసవి విజ్ఞాన తరగతులు



నరసాపురం, జూన్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) :స్థానిక ప్రథమశ్రేణి శాఖ గ్రంధాలయంలో గత 30 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా మంగళవారం బార్క్ సీనియర్ శాస్త్రవేత్త రంగినీడి సుబ్బారావు బాల బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రంథాలయములో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నారని తెలిపారు. రసాయన శాస్త్రంలో పీరియాడిక్ టేబులుపై బాల బాలికలకు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు కథలు, పద్యాల పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ చిన్నమిల్లి శ్రీనివాసరావు బాల బాలికలకు మహా గ్రంథాలు జీవిత పాఠాలు నేర్పే మాన్యువల్స్ అని అవగాహన కల్పించారు. హిందీ క్లాసులు, డ్రాయింగ్ క్లాసులు, క్యారమ్స్, చెస్, డాన్స్ లలో వారికి శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ కే.జే.ఎస్ఎల్ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వై.ఎన్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పొన్నాడ సుబ్రహ్మణ్యం, చిత్రకారుడు తోట శ్రీనివాస్, భట్టిప్రోలు సత్యనారాయణ, జీవన్ కుమార్ , సూర్యంబాబు, ప్రిన్స్ ప్రవీణ్, యన్ విక్టర్ రాజు, గూగుల్, నాగలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతన్నకు వరి విత్తనాలు అందుబాటులో.. సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు



గోకవరం ప్రజా పాలన జూన్ 6: మండల కేంద్రమైన గోకవరం సొసైటీలో రైతులకు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు. రైతులకు ఖరీఫ్ సాగు కోసం గోకవరం సొసైటీలో పలు రకాల వరి విత్తనాలు వున్నాయని తెలిపారు. అందులో రకాలు 1061 రకం 11వందలు, 1064రకం 11వందలు,పీఎల్ రకం 11వందలు,బిపిటి సాంబ రకం 930 రూపాయలు ఉన్నాయని కావాల్సిన రైతులు గోకవరం సొసైటీలో సంప్రదించి తెచ్చుకోవాలని సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు తెలిపారు.

## పార్టీలకు అతీతంగా బిసిల ఐక్యతతో పనిచేద్దాం - బిసి నాయకులు



గుడివాడ : గుడివాడ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా కలసికట్టుగా పనిచేద్దామని బిసి సంఘం రాష్ట్ర ప్రధాన కర్యదర్శి రావుల కొల్లు వెంకట నాగమల్లేశ్వరరావు, నియోజవర్గ అధ్యక్షులు దారం నరసింహరావులు పిలుపు నిచ్చారు. సోమవారం రాత్రి స్థానిక అంజనేయ పంక్షన్ హాలులో బిసి సంఘ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా రావుకొల్లు, దారంలు మాట్లాడుతూ ఇటివల జరిగిన జ్యోతిరావు, సావిత్రిబాయి పూలేల విగ్రహా అవిష్కరణ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాధలు తెలిపారు. బిసి సంఘం బలోపేతం, కార్యలయం నిర్మణంకు అందరు కృషి చేయాలన్నారు. బిసిలు రాజధికారం సాధించేందుకు ఐక్యతతో ఉండలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కె.యశోదాయామినిదేవి, ఉపాధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, వై, గొవర్ధనరావు, అగస్తి అరివిష్ణు, బి.సోమశేఖర్, ఎం.పద్మ, రాధకృష్ణ, ఎం.వెంకటలక్ష్మి, ఉద్యోగ సంఘ నాయకలు తదితరులు పాల్నొన్నారు.

## యం డి పుత్తూరులో మెగా వైద్య శిబిరం:సర్పంచ్ మోహన ప్రియ



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి :గౌరవ శాసనసభ్యులు బియ్యపు మధుసూధన రెడ్డి ఆదేశాలు మేరకు ఏర్పేడు మండలం ఇంచార్జి గున్నేరి కిషోర్ కుమార్ రెడ్డి సూచనలతో ఏర్పేడు మండలం యం డి పుత్తూరు గ్రామంలో సర్పంచ్ మోహన ప్రియ ఆధ్వర్యంలో మాధురి రెమిడి హాస్పిటల్ వారి సౌజన్యంతో తేది 07/06/2023 ఉదయం 9 గంటలకు మెగా వైద్య శిబిరం నిర్వహించబడునని సర్పంచ్ మోహనప్రియ తెలియచేసారు. ఈ వైద్య శిబిరం నందు కీళ్ళు,ఎముకల వ్యాధులు,వెన్ను,మోకాళ్ల నొప్పులకు,జనరల్ మెడిసిన్,కిడ్నీ సమస్యలకు,దంత సమస్యలకు తదితర అన్ని రకాల సమస్యలకు పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందించి ఉచితంగా మందులు అందచేయబడును. మరియు సమస్య ఎక్కువగా ఉండి ఆపరేషన్ లు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయబడునని తెలియపరస్తూ మండలంలోని అన్ని గ్రామాల వారు ఈ సదావకాశాన్ని సద్వినియోగపరచుకొనవలసినదిగా కోరారు.

## భగవద్గీత పఠనం.. శ్రావణం.. ఉత్తమమైన మార్గం

**శాసనమండలి సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం**



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి :శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భగవద్గీత మహా గ్రంథాన్ని శాసనమండలి సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం కి మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ జ్ఞానాంబవారి మధు రెడ్డి వ్యవస్థాపకులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి అందజేశారు ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ భగవద్గీత విశ్వంలోనే వేదాలకు ఉపనషతులు నిక్షిప్తంగా దాగి ఉన్నాయని ఏ గ్రంథములో లేని విషయాలు భగవద్గీతలో ఉన్నాయన్నారు భగవద్గీత పఠనం శ్రావణం ఉత్తమమైన మార్గమన్నారు శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మల్లెంభాకంముని కృష్ణారెడ్డి పదివేల మందికి భగవద్గీత మహా గ్రంథాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్తున్నారని తెలిపారు భగవద్గీత 5000 సంవత్సరాల ముందే శ్రీకృష్ణ భగవాన్ చేత బోధించబడినదిని వేదాల సారం భగవద్గీత అని ప్రతి భారతీయుడు భగవద్గీత ఆవశ్యకతను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు వ్యక్తిగత వికాసానికి భగవద్గీత ఎంతో దోహదపడుతుందని చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు భగవద్గీత చదివి ఆచరించాలన్నారు శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అతి చిన్న వయసులోనే భగవద్గీత పై మక్కువతో తనతోపాటు వేలాదిమంది కి భవద్గీతను అందించాలని లక్ష్యంతో ప్రతిరోజు భగవద్గీత మహా గ్రంధాలు అందించడం చాలా మంచిదన్నారు శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ జ్ఞానాంబ వారి మధు రెడ్డి మాట్లాడుతూ గీత లేనిదే ధర్మం లేదన్నారు ఉపనిషత్తులో వేద గ్రంధాలు భగవద్గీతలో పరిపూర్ణంగా ఉన్నాయన్నారు ప్రతి ఒక్కరూ చదివి ఆచరించదగ్గ గ్రంథం భగవద్గీత అని తెలిపారు

## రాష్ట్రంలో సుభిక్ష పాలన.. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు



విజయవాడ ప్రజా పాలన ప్రతినిధి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సుభిక్ష పాలన అందిస్తోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 28 వ డివిజన్ 204 వ వార్డు సచివాలయ పరిధిలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జి కనపర్తి కొండలరావుతో కలిసి మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. శివాలయం వారి వీధి, వందనపు వారి వీధి, ఆచార్య వీధి, స్వర హాస్పిటల్ రోడ్డులో విస్తృతంగా పర్యటించి 255 గడపలను సందర్శించారు. నాలుగేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి చేకూరిన మేలును గడప గడపకు వెళ్లి వివరించారు. వారి దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు సూచించారు. అభివృద్ధి, సంక్షేమం బాటలో పయనిస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలన జాతీయస్థాయిలో ఎందరో నాయకులకు ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా మల్లాది విష్ణు అన్నారు.తెలుగుదేశం హయాంలో ఆడపడుచులకు అందించిన సంక్షేమంపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ముందా..? అని ప్రతిపక్ష నేత చంద్రబాబును మల్లాది విష్ణు ప్రశ్నించారు. మహిళ సంక్షేమంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంతో పోటీ పడే రాజకీయ పార్టీ దేశంలోనే మరొకటి లేదని చెప్పుకొచ్చారు. డ్వాక్రా రుణమాఫీ చేస్తామంటూ 2014 లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మాటతప్పి మోసం చేయడంతో.. ఏ గ్రేడ్ గ్రూపులన్నీ ఆర్థిక క్రమశిక్షణ కోల్పోయి డి గ్రేడ్ లోకి పడిపోయాయని గుర్తుచేశారు. కనుకనే అక్కచెల్లెమ్మలందరూ 'నిన్ను నమ్మం బాబు' అంటూ 2019 లో గట్టిగా బుద్ధి చెప్పారని మల్లాది విష్ణు అన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్ ఒకే ఒక్క నిర్ణయంతో 78 లక్షల మంది పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు నాలుగు విడతలలో రూ. 26 వేల కోట్ల రుణమాఫీ చేయడం జరిగిందని చెప్పారు. కాబట్టే 'మా నమ్మకం నువ్వే జగన్' అన్నది ప్రజల గుండె చప్పుడుగా మారిపోయిందని తెలిపారు.ప్రజా మద్ధతుతో బలమైన నాయకుడిగా ఎదిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనే సత్తా రాష్ట్రంలో ఏఒక్క రాజకీయ పార్టీకి లేదని మల్లాది విష్ణు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో డీఈలు గురునాథం, రామకృష్ణ, సీడీఓ జగదీశ్వరి, నాయకులు బెజ్జం రవి, దోనేపూడి శ్రీనివాస్, శనగవరపు శ్రీనివాస్, కమ్మిలి రత్న, కోలా నాగాంజనేయులు, గుండె సుందర్ పాల్, చిన్నారావు, సాంబయ్య, కగ్గా పాండు, స్టెప్ శ్రీను, రాజశేఖర్, శ్యామల, యక్కల మారుతి, కోలవెన్ను కొండా, భోగాది మురళి, రత్నాకర్, చల్లా సుధాకర్, ప్రయాగ కృష్ణ, అన్ని శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## ఇష్టానుసారంగా కేబుల్ కనెక్షన్ ధరలు పెంపు




కారంపూడి...జూన్06...ప్రజాపాలన... ప్రతినిధి.:మారుతున్నా టెక్నాలజీకి అనుగుణంగా నేడు ప్రతి ఇంట్లో టీవీ కాని సెల్ ఫోన్ కాని లేని ఇళ్ళు ఉండవు మనిషికి తిండి ఉన్న లేకున్నా సెల్, టీవీ మాత్రం కచ్చితంగా ఉండాలని అలవాటు పడిపోయారు. దీనిని ఆసరాగా చేసుకొని కారంపూడిలో కేబుల్ యాజమాన్యం మనిషి వ్యాసనాలను అలవాట్లను ఆసరాగా తీసుకొని సొమ్ముచేసుకుంటున్నారు. కారంపూడిలో కేబుల్ వ్యాపారాన్ని కొంతమంది వ్యాపారులు గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. కారంపూడిలో తప్పనిసారిగా ప్రతిఒక్క ఇంటికి కేబుల్ కనెక్షన్ ఉంది నిన్న మొన్నటివరకు కేబుల్ యాజమాన్యం స్లాబులుగా ఏర్పాటు చేసి 200, 250, 300, 400 రూపాయలుగా కనెక్షన్ ధరలను నిర్ణయించింది ఉన్నట్లు ఉండి ప్రతి కనెక్షన్ కి 50 రూపాయలను పెంచటం జరిగింది. ఒక పక్క సన్ డైరెక్ట్, తదితర డిష్ లు తక్కువ ప్యాకేజీలు ఆఫర్ల రూపంలో ఇస్తున్నప్పటికి కారంపూడి కేబుల్ యాజమాన్యం మాత్రం తమ ఇష్టనుసరంగా ధరలను నిర్ణయించి సొమ్ముచేసుకుంటున్నారు. అన్ని ఛానల్ లు వచ్చే కేబుల్ కనెక్షన్ నెలకు మూడు వందలు అని చెప్పిన యాజమాన్యం ఎటువంటి ప్రచారం లేకుండా కేబుల్ వినియోగదారులకు తెలియచేయకుండా ఏకంగా యాభై రూపాయలు పెంచటం జరిగింది. అంతేకాకుండా నెల రోజులకు అంటూ వినియోగదారుల వద్ద కేబుల్ డబ్బులు వసులు చేసి ప్రసారాలు మాత్రం 28 రోజులు మాత్రమే ప్రసారం అవుతాయి అంతే కారంపూడి కేబుల్ యాజమాన్యానికి నెల రోజులు అంతే నెలకి 28 రోజుల అని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. నెల ప్యాకేజీ దారులకు రెండు రోజుల ముందే ప్రసారాలు నిలిపివేయటం ఇక్కడ కేబుల్ యాజమాన్యానికి అలవాటుగా మారింది ఇదేమిటి అని ఎవరైనా ప్రశ్నిస్తే ఒకొక్క కేబుల్ కనెక్షన్ కు 220 రూపాయలు చెల్లించవలసి వస్తుందని సమాధానం చెప్తున్నారు. ఏదిఏమైనా కారంపూడిలో కేబుల్ యాజమాన్యం పేదవాడి నడ్డి విరుస్తుందన్న విషయం అక్షర సత్యం. ఇప్పటికైనా అధికారులు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు సత్వరచర్యలు చేపట్టి కారంపూడి కేబుల్ యాజమాన్యం ఆగడలు అరికట్టవలసిన బాధ్యత ఎంతైనా ఉందని వినియోగదారులు, ప్రజలు కోరుతున్నారు.

## స్లూయిజ్‌లకు మరమ్మతులు చేపట్టండి



భీమవరం, జూన్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) :నియోజకవర్గ పరిధిలో ఉన్న స్లూయిజ్లను పరిశీలించి వాటికి మరమ్మత్తులు అవసరమైతే వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. స్థానిక కాపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పెదగరువు వద్ద ఉన్న స్లూయిజ్ ను, శృంగవృక్షం వద్ద ఉన్న స్లూయిజ్లకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ డిఈ కే శ్రీనివాస్, ఏఈ వినయ్ కుమార్ లు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



భీమవరం, జూన్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) :ఏపీని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన మూడు లక్షల రూపాయల చెక్కును లబ్ధిదారుడు బొర్రా రామచంద్రరావు కుమారుడు వాసుకు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆనాడు ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని నేడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ ఆరోగ్యశ్రీ పేరిట ఈపథకాన్ని కొనసాగిస్తూ 3 వేలకు పైచిలుకు వ్యాధులకు ఉచిత వైద్యాన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో పేదలకు అందిస్తున్నారని అన్నారు. ఈ పథకాన్ని మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఎంపికచేసిన కార్పొరేట్ హాస్పిటల్లో కూడా ఈ పథకం అమలయ్యే విధంగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో లేని వ్యాధులకు సైతం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆదుకుని వైద్యం చేయిస్తున్నారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా పేదలకు పూర్తిస్థాయిలో ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కిందని అన్నారు. భీమవరం నియోజకవర్గంలోని ప్రజలతో పాటు జిల్లాలోని ప్రజలకు కూడా వైద్యపరంగా మరింత మేలు చేసేందుకు100 పడకల ఆసుపత్రిని కూడా భీమవరంలో నిర్మించడం జరుగుతుందని అన్నారు.

## ఆర్యవైశ్య యువజన సంఘం కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం



సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి : ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్తెనపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ పేండం బాబురావు హాజరై మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పెరుమళ్ళ సుధాకర్ సహకారంతో ఈరోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలియజేశారుఈ కార్యక్రమం ఉద్దేశించి పెండెం బాబురావు మాట్లాడుతూ ఎండాకాలం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేయడం అందులో మమ్మల్ని కలుపుకొని కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్న కొత్త రామకృష్ణ నీ అభినందించారు. అంతేగాక గత 45 రోజుల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా కూడా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి ఎంతోమందికి దాహం తీరుస్తున్నారని కొనియాడారు.ఆ తరువాత బాబూరావు నీ సంఘ సభ్యులు అందరూ కలిసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో , కొల్లిపర కుమార్, , కాశీ విశ్వనాథం, రాఘవ, హరి, మాచర్ల సత్యనారాయణ, కాకర్ల రమేష్, స్వామి ప్రసాదు, చెక్క రవికుమార్ సురేష్, వెంకట్,సైదేష్,మోహన్ బాండ్ మొదలగువారు పాల్గొన్నారు

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బాలాజీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ సహకారంతో మజ్జిగ పంపిణీ



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి: కాకినాడ జిల్లా జగ్గంపేట మే 6: వేసవికాలంలో ఎండలు విపరీతంగా మండిపోవడంతో జగ్గంపేట వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ బాలాజీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ కొత్త బైరవ కృష్ణ సహకారంతో 75 వ రోజు స్థానిక కాకినాడ రోడ్ లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి వాసవి క్లబ్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్, అన్నవరం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) హాజరై పాదచారులకు వాహనదారులకు మజ్జిగ, చల్లని శుద్ధి చేసిన మంచినీళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఇప్పుడు 46 నుంచి 50 డిగ్రీలు వరకు ఎండలు మండిపోవడంతో జగ్గంపేట ఆర్యవైశ్య ప్రముఖులందరూ సహకారంతో మజ్జిగ మంచినీళ్లు పంపిణీ చేస్తున్నామని దీనికి సహకరిస్తున్న ప్రతి ఒక్కదాతకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజినల్ చైర్మన్ మానేపల్లి బంగారాజు, కొత్త నాగుపండు, విజయ, పొట్టి రాజేష్, మానేపల్లి రామానుజ , బొండాడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
బుధవారం 07, జూన్ 2023

# అధోగతిలో ఆంధ్రప్రదేశ్

నాలుగేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో ఒక యువకుడు ఒక పార్టీ స్థాపించి అత్యంత భారీ మెజారిటీతో విజయం సాధించినప్పుడు ఆయన జనరంజకంగా పాలిస్తారని, అన్ని వర్గాలను కలుపుకుని పోయి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతారని అనేకమంది భావించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ కూడా అదే విధంగా ఆలోచించి, అన్ని రాష్ట్రాలకు తోడ్పడిన విధంగానే ఆంధ్రప్రదేశ్ కూడా సర్వతోముఖాభివృద్ధి చెందేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలను అందించింది. ఇవాళ వెనక్కి తిరిగి చూస్తే ఈ నాలుగేళ్లలో ఏపీలో జరిగినంత అరాచక, అవినీతి పాలన మరే రాష్ట్రంలో జరగలేదని అర్థమవుతోంది. రాష్ట్రంలో ఎక్కడకు వెళ్లినా ఈ పాలన ఎప్పుడు అంతం అవుతుందన్న రీతిలో మాట్లాడుతున్నారంటే నాలుగేళ్లలో ప్రభుత్వం ప్రజలకు నరకం చూపించిందని స్పష్టమవడం లేదా? అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ జగన్ ఒక అభద్రతా భావంతోనే గడిపారని చెప్పక తప్పదు. నిజానికి ఆత్మవిశ్వాసం, దూరదృష్టి, విశాల హృదయం ఉన్న నేత ఎవరైనా ఒక పురోగామి దృక్పథంతో రాష్ట్రానికి కొత్త దిశా నిర్దేశం కల్పించి తన పేరును చరిత్రలో శాశ్వతం చేసుకుంటారు. అయితే జగన్ అధికారంలోకి వచ్చీ రాగానే విద్వేషపూరిత, విధ్వంసక రాజకీయాలను ప్రారంభించారు. అభివృద్ధిని అటకెక్కించి ఆలయాల్లో విగ్రహాలను ధ్వంసం చేయడంతో ప్రారంభించి, అరెస్టులు, హింసాకాండతో బీభత్సం సృష్టించడం, మాఫియా మూకలతో అరాచకత్వాన్ని, హత్యా రాజకీయాలను ప్రోత్సహించడం, ప్రత్యర్థులను భయభ్రాంతులు చేయడం, ప్రశ్నించిన వారిపై పోలీసులను ప్రయోగించడం, ఆఖరుకు న్యాయమూర్తులపై, ప్రజా ప్రతినిధులపై కూడా దాడులు చేయడం, సినీరంగాన్ని కూడా భయపెట్టడం, మతమార్పిడులకు చేయూతనివ్వడం, మీడియా గొంతునొక్కడం వంటి అనేక సంఘటనలు జగన్ హయాంలో జరిగాయి. మరో వైపు రివర్స్ టెండరింగ్ అంటూ పోలవరం ప్రాజెక్టుకు అడ్డంకులు సృష్టించడం, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేయడం, మూడు రాజధానులు అంటూ ఉన్న రాజధాని పనులు నిలిపివేయడం, మద్యపాన నిషేధాన్ని అమలుపరుస్తామని ప్రకటించి వికృత బ్రాండ్లు ప్రవేశపెట్టి ప్రజల జీవితాలతో చెలగాటమాడడం, కేంద్ర ప్రభుత్వ నిధులన్నీ ఇతర అవసరాలకు మళ్లించడం, ఎడా పెడా అప్పులు చేయడమే కాక ప్రజల ఆస్తుల్ని కూడా తాకట్టు పెట్టడం, ఇసుక, మైనింగ్ తదితర రంగాల్లో అస్మదీయుల దుర్మార్గాలకు అండదండలివ్వడం, ఎక్కడ చూసినా భూఆక్రమణలు, దౌర్జన్యాలు, కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించకపోవడంతో అభివృద్ధి స్తంభించిపోవడం, పెట్టుబడులు పూర్తిగా నిలిచిపోవడం, అన్ని రంగాల్లో అవినీతి తారస్థాయికి చేరుకోవడం వంటి అనేక ఆర్థిక అరాచకాలు ఈ నాలుగేళ్లలో మనకు కనపడతాయి. నిజానికి వీటన్నిటినీ ఒక్కొక్కటీ జరిగిన సంఘటనలతో సహా వివరిస్తూ ఏకరువు పెడితే అనేక సంపుటాలు ప్రచురించవచ్చు. ఒక్క ముఖ్యమంత్రి నాలుగేళ్లలో ఇన్ని దుర్మార్గాలకు పాల్పడగలరా అన్న ఆశ్చర్యం కలుగుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చీ రాగానే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి నీతి ఆయోగ్‌ను ఏర్పర్చి సహకార సమాఖ్య విధానాన్ని అమలు చేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించారు. నీతి ఆయోగ్ సిఫారసుల మేరకు కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 41 శాతం వాటా కల్పించాలని నిర్ణయించి ఆ మేరకు ఆంధ్రప్రదేశ్‌తో సహా అన్ని రాష్ట్రాలకు గతంలో వచ్చిన పన్నుల కంటే మెరుగైన ఆదాయం లభించేలా చూశారు. రాష్ట్ర విభజన మూలంగా ఆంధ్రప్రదేశ్‌కు ఏర్పడిన ప్రత్యేక ఆర్థిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందించింది. ఈ నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రానికి ప్రత్యేక ఆర్థిక సహాయం రూపేణా రూ. 62 వేల కోట్ల కంటే అధికంగా అందిన విషయాన్ని మరిచిపోరాదు. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు ఏపీకి ఎప్పటికప్పుడు వేల కోట్ల మేరకు రెవిన్యూ లోటును పూరిస్తూనే వచ్చింది. జీఎస్టీ అమలు వల్ల వచ్చే నష్టపరిహారం పూరించడంతో పాటు అభివృద్ధి ఆగకూడదనే ఉద్దేశంతో రుణాలను చేసేందుకు అవకాశం కల్పిస్తూనే వచ్చింది. పోలవరం ప్రాజెక్టును త్వరిత గతిన పూర్తి చేయాలనే లక్ష్యంతోనే మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏడు తెలంగాణ ముంపు మండలాలను ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రాలో కలిపేందుకు పార్లమెంట్‌లో చట్టం చేసింది. రివర్స్ టెండరింగ్ పేరిట డబ్బు ఆదా చేస్తామని ప్రగల్భాలు పలకడం, లెక్కలు సరిగా చెప్పకపోవడం మూలంగా అంచనా వ్యయం భారీగా పెరగడం, పనుల అమలులో పారదర్శకత లేకపోవడం, నిర్మాణం ఆగిపోయిన సమయంలో వరదలకు కాపర్ డామ్ కొట్టుకుపోవడం మూలంగా పోలవరం ఎప్పుడు పూర్తి అవుతుందో చెప్పలేని పరిస్థితి. ఇది జగన్ సర్కారే కల్పించిన దుస్థితి అనడం నిజం కాదా? నిజానికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న మోదీ సంకల్పానికి అనుగుణంగా జగన్ ప్రభుత్వం పనిచేసి ఉంటే ఆంధ్రప్రదేశ్ అక్షరక్రమంలో మాత్రమే కాక అభివృద్ధిలోనూ అగ్రగామిగా మారి ఉండేది. అయితే ఫక్తు విద్వేష, మాఫియా, అరాచక, అవినీతి రాజకీయాలలో తలమునకలైన జగన్ సర్కార్ సంకుచిత దృక్పథంతో వ్యవహరించి ఏపీని అధోగతి పాలు చేసిందనడం సత్య దూరం కాదు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన లక్షల కోట్ల నిధులు, రాష్ట్ర ప్రభుత్వం ఎడా పెడా చేసిన రూ. 10 లక్షల కోట్లకు పైగా అప్పులు ఈ నాలుగేళ్లలో ఎక్కడకు పోయాయి? ప్రభుత్వోద్యోగులకు కూడా ప్రతినెలా మొదటి తేదీన జీతాలు చెల్లించలేని ఘోరమైన ఆర్థిక దుస్థితి ఎందుకు ఏర్పడింది? పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఎందుకు ముందుకు రావడం లేదు? విద్యుత్ కోతలు, నీరు, ఇసుక కొరత, దెబ్బతిన్న రహదారులు, క్షీణించిన శాంతిభద్రతలు పరిశ్రమలను భయపెడుతున్న మాట నిజం కాదా? పెట్టుబడులు పెట్టాలన్నా, ఇళ్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నా వైసీపీ నేతలు ముడుపులు, వాటాలకోసం బెదిరిస్తున్నారన్న విషయంలో వాస్తవం లేదా? అధికారంలోకి రాకముందే క్విడ్ ప్రోకో సంస్కృతికి అలవాటు పడ్డ జగన్ హయాంలో ప్రతి పనిలో నీకది–నాకిది అనే ఫార్ములా పారిశ్రామికవేత్తలను భయపెట్టడం లేదా? గత నాలుగేళ్లలో రూ. 17 లక్షల కోట్ల పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరలి వెళ్లడం, స్టార్టప్‌ల విషయంలో ఏపీ 15వ స్థానానికి దిగజారడం వాస్తవం కాదా? రాష్ట్రమంతటా నిరుద్యోగం తాండవిస్తున్న మాట నిజం కాదా? జగన్ ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ఎక్కడకు పోయింది?

# రెడ్డి ఫ్యాక్షనిజాన్ని కథల్లో చెప్పిన విశ్వనాథరెడ్డి

ప్రముఖ సాహితీవేత్త, కథా శిల్పి, మానవతావాది, మార్క్సిస్టు భావజాలకర్త కేతు విశ్వనాథ రెడ్డి గారి మృతి సాహితీ లోకానికి మరువలేని స్మృతి. కేతు విశ్వనాథ రెడ్డి గారు కడప జిల్లాలోని గ్రామ నామవాచకాలను లెక్కించటం ద్వారా వాటి నేపథ్యాన్ని విశ్లేషించడం ద్వారా ఆంధ్రుల సామాజిక సాంస్కృతిక చరిత్రకు నూతనమైన మలుపు తీసుకువచ్చారు. సురవరం ప్రతాపరెడ్డి, రాచమల్లు రామచంద్రారెడ్డి, కె.వి.రమణారెడ్డి, కేతు విశ్వనాథ రెడ్డి వంటి వారు తెలుగు సాహిత్య రంగంలో కులాతీత భావ చైతన్యాన్ని కలిగించారు. కేతు విశ్వనాథ రెడ్డి గారు చాలా సౌమ్యులు. పరిశోధనా దక్షులు. కులేతర, మతేతర భావజాల సంపూర్ణులు. ఇటీవల కడప నుండి నాతో ఫోన్లో మాట్లాడారు. మీ రచనలు కవితలు పోరాటాలు ఎప్పుడు నన్ను ఉత్తేజపరుస్తుంటాయి. మీర ఈ తరానికి స్ఫూర్తి అని అన్నాడు. నాకు ఎంతో సంతోషం వేసింది. అంతేకాదు సామాజిక శాస్త్రవేత్తలను ప్రోత్సహించడంలో ఆయనకు ఏ విధమైన బేధాలు లేవు. ముఖ్యంగా ఆయన అ.ర.సం అధ్యక్షునిగా చేయడమే కాక కొడవటిగంటి కుటుంబరావు రచనలను సంపుటాలుగా వెలువరిచండం ద్వారా ఒక పెద్ద సాహితీ నిధిని తెలుగువారికి అందించినట్లు అయ్యింది. విశ్వనాథ రెడ్డి గారి కథల్లో రాయలసీమ అస్తిత్వం ఉంటుంది. ఒక రెడ్డి కులంలో పుట్టి, రెడ్డి ఫ్యాక్షనిజం యొక్క నేపథ్యాన్ని చెప్పగలిగిన ధైర్యం గలవారు ఆయన. వారి కథల్లో దళిత పాత్రలు రెడ్డి, భూస్వామి యొక్క ఆధిపత్యాన్ని నిలేస్తాయి. అది ఆయన కుల, వర్గ ఆధిపత్య దోపిడీ వ్యతిరేక భావనకు నిదర్శనం. కేతు విశ్వనాథ రెడ్డి గారు వైయస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు నాతో పాటు కలిసి తీసుకోవడం నాకు ఒక అనుభూతి. కేతు విశ్వనాథ రెడ్డి గారు కేవలం సాహితీవేత్తే కాదు. సమాజం పట్ల బాధ్యత కల పౌరుడు. ఆయన భారతదేశంలో ఉన్న కులాధిపత్య, వర్ణాధిపత్య సమాజాన్ని స్పష్టంగా, శాస్త్రీయంగా అర్థం చేసుకున్నవాడు. గతితార్కిక చారిత్రక భౌతిక వాద దృక్పథం గల అభ్యుదయ రచయిత. ఆయన గొప్ప కథకుడు. ముఖ్యంగా రెడ్ల దొడ్లలో దళితులు పడే బాధలు, వ్యథలు, అణచివేతలు, నిందలను నిష్కర్షగా రాసిన ధీరుడు. ఆయనకు రెడ్డి ఆధిపత్యంలో ఉన్న భూస్వామ్య కర్కశత్వం అర్థమయ్యింది. భూస్వామ్య కులాలు దళితుల్ని అమానుషంగా వేధించారని ఆయన స్పష్టంగా చెప్పారు. దళితులు కూలీలు గానే బతకాలనీ, వాళ్ళ పిల్లలు చదువుకోకూడదనే దుష్ట నీతి కొందరు భూస్వామ్య కులాలకు ఉందని గమనించారు. భూస్వామ్య కులాలు భూములు ఆక్రమించడంలో సాయుధులయ్యారని, ఫ్యాక్షనిజాన్ని ఆశ్రయించారని, ఆస్తికోసం, అధికారం కోసం అడ్డువచ్చిన వారిని ఎవరినైనా నిర్దాక్షిణ్యంగా హతమార్చడానికి కూడా వెనకాడలేదని తన నవలలలో, కథల్లో దృశ్యీకృతంగా చెప్పారు. సాహిత్యం అంటే అది సామాజిక ప్రయోజనాన్ని, సామాజిక మార్పును, సామాజిక సంఘర్షణను దృశ్యీకృతంగా చెప్పగలిగిన స్థాయిలో ఉండాలని ఆయన అన్నారు. ఇకపోతే సమాజాన్ని ఉన్నది ఉన్నట్లుగా చూపించిన రచయితలు ఎక్కువమంది. వారు సమాజాన్ని స్థిరీకృతం చేస్తారని చాలామంది సమాజ మార్పుకు అడ్డుగోడలు నిర్మించే సాహిత్యాన్నే సృష్టిస్తారని, పరాన భుక్కులుగా ఉన్న రచయితలు ధనవంతుల దగ్గర బిచ్చగాళ్లుగా బతుకుతారని ఆయన అభిప్రాయపడ్డారు. చాలామంది రచయితలు పరాన్న భుక్కులని ఇతరులను దేహీ అని బతకడం వల్ల వారికి అనుకూలమైన భావాలను ప్రకటిస్తారని, రచయిత స్వతంత్రుడై ఉండాలని, రచయితకు వ్యక్తిత్వం లేకపోతే అతను మరణించాక కనుమరుగవుతాడని కేతు విశ్వనాథ రెడ్డి గారి భావన. కడప జిల్లా నుండి ఎక్కువమంది రచయితలు



వచ్చారంటే ఆ జిల్లాలో అణిచివేత ఉంది. కులాధిపత్యం ఉంది. ఫ్యాక్షనిజం ఉంది. దోపిడీ ఉంది. తడి లేని తనం ఉంది. వలస జీవితం ఉంది. అందుకే ప్రతి అంశము కథకు, నవలకు అక్కడ వీలుగా ఉంది. ఎక్కువమంది రచయితలు అక్కడ ఉండేటటువంటి పేదరికం గురించి రాశారు కానీ కేతు విశ్వనాథ రెడ్డి గారు అక్కడ ఉండే కులాధిపత్యాన్ని కూడా తన నవలల్లో, కథల్లో పేర్కొనగలిగారు. ముఖ్యంగా అస్పృశ్యులు అంటే ఆయనకు ఇష్టం. వారు నీతిపరులని, శ్రమజీవులని, ఇతరుల సొమ్మును ఆశించరని, ఇతరుల భూములు ఆక్రమించరని, శ్రమకు విశ్వాస పాత్రులని, దేశీయ జీవన సంస్కృతికి వారు వారసులని ఆయన భావిస్తారు. ముఖ్యంగా కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలలోని ఆర్కియాలజీ రిపోర్టు ప్రకారం కొత్త రాతి, పాత రాతియుగాల నాటి ఉత్పత్తి శక్తులు దళితులే. భూస్వామ్య కులాల వారు అక్కడకు వివిధ కాలలలో వలస వచ్చినవారే, దేశీయులు కారు. వీరు భూ పాలెగాళ్లు. వీరిది సామంత గుణం. దళితులది ఇండిపెండెంట్ నేచర్ వారు దేశీయులు. వారు ఉత్పత్తి పరికరాల్ని ఉత్పత్తికే వాడతారు గాని హత్యలకు వాడరు. దళితులకు హంతక స్వభావం ఎప్పుడూ లేదు. వారు అతి పూర్వకాలం నుంచి బౌద్ధులు. వారి జీవితములో కరుణ, ప్రేమ, నీతి, ప్రజ్ఞ, ఆత్మీయత, అనురాగం, ఆదర్శం ఉంటాయి. వారు దోసెడు నీళ్లు దొరికితే గుప్పెడు ధాన్యం పండించగలరు. దళితులది ఉత్పత్తి సంస్కృతి. అగ్రవర్ణాలది ఆధిపత్య సంస్కృతి. కేతు విశ్వనాథ రెడ్డి గారు దగ్గర దగ్గర ఈ భావాలన్నీ తమ నవలల్లో, కథల్లో దృశ్యీకరింపజేశారు. ఆయనది కరుణ హృదయం. ఆయన కన్నీటిని అక్షరాల్లో పొదుగుతారు. "కరుణ ఏవ ఏకో రసః" అన్నారు. దుఃఖాన్ని చెప్పని వాడు కథకుడు కాదు. కవి కాదు. కళాకారుడు కాదు.

కడప రచయితల్లో శాంతి నారాయణ గారు కుల అణచివేతను దృశ్యీకరింపజేసిన గొప్ప బహుజన నవలాకారుడు. ఆయన కేతు విశ్వనాధ్ రెడ్డి గారికి సహచరుడు. కేతు విశ్వనాథ రెడ్డి గారిని అందరూ పెద్దదిక్కుగా భావిస్తారు. మార్క్స్, బుద్ధుడు ఇద్దరూ దుఃఖాన్ని నివారించడానికి తత్వాన్ని చెప్పారు. దాన్ని కేతు విశ్వనాథ రెడ్డి గారు అక్షరాల ఆచరించిన ఈనాటి అభ్యుదయ రచయిత. కేతు విశ్వనాథరెడ్డి గారు సహజంగా కవి ప్రేరకుడు. ఆయన జీవితంలో ప్రణాళిక బద్ధంగా ఎన్నో కార్యక్రమాలు చేశారు. ముఖ్యంగా రాయలసీమ గుండె సొద విన్నారు. రాయలసీమలోని గుండె మంటను అందుకున్నారు. ఆయన కథా శిల్పంలో రాయలసీమ ప్రజల హృదయ వేదన ఉంటుంది. ఆయన గొప్ప చదువరి. గొప్ప ఉపన్యాసకుడు కూడా. ఆయన సాహితీ విమర్శలో డైలక్టికల్ నేచర్ ఉంటుంది. ఆయన పొగడ్తలకు పొంగిపోయేవాడు కాదు. ఇతరులను పొగిడి బతికేవాడు కాదు. అందుకే కేతు విశ్వనాథ రెడ్డి గారు కన్నీటి ధారలతో కూడిన సాహిత్య శిల్ప రూపకర్త అని చెప్పవచ్చు. అభ్యుదయ జీవన సంస్కృతి వికాస ప్రకాశకుడు. ఈ శతాబ్దపు తెలుగు సాహిత్యంలో ఆయన ఒక అభ్యుదయ సాహితీ ప్రతీక. ఈ యుగ సాహితీ నిర్మాతల్లో ఆయన ఒకరు. కేతు విశ్వనాథ రెడ్డి గారి పుస్తకాలన్నీ వాల్యూమ్స్‌గా ముద్రించి సమాజానికి అందించడం ద్వారా సాంస్కృతిక విప్లవానికి కొనసాగింపు జరుగుతుంది. సాహిత్యం ఒక అనంత ప్రవాహం. అది భూత, వర్తమాన, భవిష్యత్ కాలాన్ని సమన్వయించుకుంటూ ముందుకు నడవాలి. నిన్నటి అభ్యుదయాన్ని త్రోసివేస్తే నేడు విప్లవం సృష్టి కాదు. అందుకే కేతు విశ్వనాథ రెడ్డి గారు మీతో, నాతో, అందరితో ఎప్పుడూ ఉంటారు. కేతు విశ్వనాథ రెడ్డి గారు కుల, మత, దళిత, స్త్రీ భేదాలు లేకుండా ఆయన సాహితీ విమర్శని, కవిత్వాన్ని, కథని, నవలని ప్రోత్సహించారు. సాహిత్యం అంటే సామాజిక అంతరాలను తొలగించే శక్తిగలదై ఉండాలి. సామాజిక అంతరాలు తరాలుగా చిట్టెం కట్టుకొని ఉంటాయి. వాటిని ప్రయ్యలు చెయ్యాలంటే అక్షరానికే సాధ్యం. అక్షరం అనేక మాలిన్యాలను తుడిచి వేసుకుంటూ వెళ్ళింది. అక్షర సృష్టికర్తకు హేతువాద, సామ్యవాద, లౌకికవాద భావజాలం ఉన్నప్పుడే సామాజిక, ఆర్థిక అంతరాలను తొలగించే శక్తి ఉంటుంది. కేతు విశ్వనాథ రెడ్డి గారి కథల్లో, నవలల్లో, విశ్లేషణలో హెగెల్ డైలెక్టిక్స్ కనబడుతుంది. కార్ల్ మార్క్స్, హెగెల్ గతితర్కాన్ని ఫ్యూర్బా భౌతిక వాదంతో సమన్వయించారు. కార్న్ ఫోర్త్ గతితార్కిక భౌతికవాదాన్ని సామాజిక దృక్కోణం నుంచి విశ్లేషించారు. మావో డైలెక్టికల్ మెటీరియలిజాన్ని ఆధారం చేసుకుని "వైరుధ్యాలు" అనే గ్రంథం రాశారు. భారతదేశంలో తాత్విక భావజాల రంగంలో సామాజిక తత్వ సమన్వయం లోపించింది. కేతు విశ్వనాథ రెడ్డి గారి రచనలలో మనకు ఈ సామాజిక అన్వయం కనిపిస్తుంది. నిజానికి రాయలసీమ మొత్తంగా బౌద్ధ సంస్కృతి ఒకనాడువి. ఆ తర్వాత వీరశైవ, వీర వైష్ణవ ఉద్యమాలతో అది సన్నగిల్లింది. ఆ తర్వాత వచ్చిన కమ్యూనిస్టు ఉద్యమంలో కూడా ఇక్కడ సామాజిక భావజాల అన్వయం ఉంది. భూస్వామ్య పెత్తందారీ కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లే ఇక్కడ ఎక్కువమంది తిరుగుబాటు దారులయ్యారు. తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య రెడ్డి వీరందరూ భూస్వామ్య కుల పెత్తందారీ సమాజం నుంచి వచ్చినవారే. అయితే వీళ్ళు ఆ సమాజంతోనూ, కుటుంబాలతోనూ పోరాడారు. ఈ మొత్తం పోరాట ప్రభావం ఆ తర్వాత వచ్చిన రచయితల మీద ఉంది. కేతు విశ్వనాథరెడ్డి ప్రభావంతో వచ్చిన వారిలో శాంతి నారాయణ గారు బడుగు వర్గ ప్రతినిధిగా అంటరానితనం మూలాలను బయటపెట్టారు. అక్షరం యొక్క శక్తి దుఃఖాన్ని తెలియజేసేటప్పుడే బయటపడుతుంది. అక్షరం పోరాటంలో నినాదం అవుతుంది. ఉద్యమంలో బ్యానర్ అవుతుంది. తిరుగుబాటులో ప్రకటన అవుతుంది. కథనంలో నదులు పొంగిస్తుంది. అందుకే ప్రపంచాన్నే మార్చిన అక్షరాలు రచించిన వాల్టేర్, రూసో, హెగెల్, మార్క్స్, పూలే, అంబేద్కర్ వంటి వారు వారి ప్రభావం కేతు విశ్వనాథ రెడ్డి గారి తరం రచయితల మీద బలంగా ఉంది. రాజ్యం అనేక సందర్భాల్లో రచయితలను నిర్లక్ష్యం చేసింది. నిర్లక్ష్యమైన రచయిత ఉప్పొంగిన సముద్రంల కోటల్ని ముంచేస్తాడు. రచయిత, కవి సామాన్యుడు కాదు. అసమాన్య ప్రతిభ కలిగిన వాడు. దేశాలే వారిని భరించలేకపోయాయి. కేతు విశ్వనాథ రెడ్డి గారు ఒక నిర్మాణాత్మకమైన వ్యవస్థను నిర్మించిన ప్రతిభాశాలి. కేతు విశ్వనాథ రెడ్డి గారు ఒక విశ్వవిద్యాలయం. విశ్వజనీయమైన భావన సృష్టికర్త. ఆయన పేరును రాయలసీమలోని ఏదో ఒక విశ్వవిద్యాలయానికి పెట్టడం సముచితం. నిజానికి రాజమండ్రిని నన్నయ కంటే కుసుమ ధర్మన్న ఎక్కువ ప్రభావితం చేశారు. శ్రీకాకుళాన్ని ఇతర రచయితల కంటే వంగపండు ప్రసాదరావు గారు ఎక్కువ ప్రభావితం చేశారు. తెలంగాణను గూడ అంజయ్య గారు ప్రభావితం చేసినంతగా మరెవరు ప్రభావితం చేయలేదు. తమిళనాడులో, బెంగాల్లో ఇటువంటి వారి పేర్లతో అన్నింట విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. అయితే తెలుగు అకాడమీకి బ్రాంచ్‌గా రాయలసీమ భాషా సాంస్కృతిక అకాడమీని కూడా పెట్టాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే కేతు విశ్వనాథ రెడ్డి గారు ఊర్ల పేరు మీద చేసినపరిశోధన లో భాషా శాస్త్ర, మానవ పరిణామశాస్త్ర, పురాతత్వశాస్త్ర చారిత్రక మూలాలు ఉన్నాయి. దానికి కొనసాగింపు పరిశోధన జరగలేదు. కేతు విశ్వనాథ రెడ్డి గారు మరువరాని మహా మనిషి. కేతు విశ్వనాథ రెడ్డి గారి పేరు రాయలసీమ జిల్లాల్లో ఒక జిల్లాకు పెట్టవలసిన చారిత్రక అవసరం ఉంది. చరిత్రను సృష్టించినవాడు ఆకాశ నక్షత్రాల్లో పొదగబడిన కీర్తివంతుడు. వారి మార్గంలో నడుద్దాం.

**డాక్టర్ కత్తి పద్మారావు.**
**9849741695.**



# ధర్మనిష్ఠుడై

అనాగరికుడై ఆటవిక వాసుడై
పంచభూతాల ఆరాధకుడై
లిపిరహిత బాషా సంకేత
నాట్య వినోద పరవశులై
ప్రకృతిఒడిలోని ఆదిమ మనిషి !
కట్టుబొట్టు కట్టుబట్టల
కట్టుబాట్లు తెలియకున్నా
కలసి కట్టుగా జట్లు జట్లుగా
బాగ బతికిన ఆ మనిషి !

ఆకలైతే ఆకులలములు
వేటాడిన మాంసం పూట పూటకు
తెచ్చుకొంటూ కడుపారా తినీ తాగి
కంటినిండా నిద్దరోయిన ఆ మనిషే !
ఆట పాట మాట నేర్చికూర్చి
అక్షరాలై నాగరీకం పేరుపెట్టి
ఎండ గాలి వాన రంగు రుచులన్నీ
కనిపెట్టి నాదినీదనే ఈ మనిషి!
అదీ చాలక దొరికేవన్ని నాకెనంటూ
దోచుకుంటూ దాచుకుంటూ
ఆశమీరి ఆకృతినెల్ల కొల్లగొట్టి
విధ్వంసకుడై వికృతుడై ఈ మనిషి!
మట్టి ఇసుక రాళ్లు నేల నీరు
కొండ గుట్ట చెట్టు పంట ఆకు
కనిపించీ చేత చిక్కే దేన్నైనా
కొల్లగొట్టే పర్యావరణ భక్షుడై ఈమనిషి

అంతే కదా,
సృష్టిలో ఉద్భవించిన
జలచరవృక్ష జీవరాసుల
ప్రకృతి సంపదలన్నీ
మానవాతీత మైనవేకదా !
విశ్వాంతరాళంలో వెలసిన
సూర్య చంద్ర నక్షత్ర
గ్రహ కూటముల రహస్యాలెన్నో
మానవ రహితమే కాదా !

మనిషి బతకాలి పరాన్నజీవుడై
మనిషిగా బతకాలి కారుణ్యుడై
మనిషై బతకాలి ప్రకృతి ధర్మనుషుడై
మనిషి తర్వాత మనిషీ బతకాలి!



**దాసన్నగారి కృష్ణమూర్తి**
**మహాబోధి సాహిత్య వేదిక.**

# క్రమశిక్షణకు మారుపేరు ఆంజనేయులు...





పెనుమంట్ర (న్యూస్ ప్రతినిధి): క్రమశిక్షణకు,మంచి వ్యక్తిత్వానికి మారుపేరు కుసుమ ఆంజనేయులు అని వక్తలు తెలిపారు. మండలంలోని నెగ్గిపూడి శివారు వనంపల్లి గ్రామంలో కుసుమ ఆంజనేయులు స్మారక సమావేశము యస్సీసి నాయకులు గుత్తుల సాల్మన్ దొర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో దళితులు ఉన్నత స్థానంలో నిలవాలని, ఆశయాలను తూచా తప్పకుండా పాటించడం ద్వారా మెరుగైన జీవన విధానం సాధించవచ్చునే తపన కలిగిన వారన్నారు. ఆంజనేయులు చిరునవ్వే చిరునామాగా, వయోభేదం లేకుండా ప్రతి ఒక్కరిని గౌరవిస్తూ తెల్లటి వస్త్రధారణతో సైకిల్ తొక్కడం ద్వారా పర్యావరణ కాలుష్యం అరికట్ట వచ్చని నమ్మి ఎనభైరెండు సంవత్సరాల వయసు వరకు ఆచరిస్తూ కన్నుమూయడం తీరనిలోటని అన్నారు. ముందుగా కుసుమ ఆంజనేయులు చిత్రపటాన్ని స్థానిక దళిత నాయకులు ఉన్నమట్ల మునిబాబు, కాదెం సింహాచలం, మాజీ సర్పంచ్ వసంతాడ నాగేశ్వరరావు, సోడగిరి నాగేశ్వరరావు తదితరులు ఆవిష్కరించగా, కుమారుడు ఆదర్శ ఫౌండేషన్, కమలరత్నం మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కుసుమ భోగరాజు, కుటుంబసభ్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దైవసేవకులు విశ్వానరావు, వై. డేవిడ్, కొడవంచిలి ఇమ్మానుయేల్, సూరంపూడి సుధీర్, బిషప్ తానేటి ఏసురత్నం, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ కడలి వెంకటేశ్వరరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖమంత్రి పర్యాటనపై అధికారులతో మంత్రులు ఆదిమూలపు సురేష్, జోగి రమేషలు సమీక్ష



గుడివాడ : మంగళవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర పురపాలక పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలసీల రఘురాం, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ కోటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా ఎస్పి పి. జాషువా, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పేర్ని వెంకటరామయ్య, కొడాలి శ్రీవెంకటేశ్వరరావులతో కలసి గుడివాడ మల్లాయపాలెం లోని టిడ్కో గృహాల ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించారు. ఈ పర్యటనలో మంత్రుల వెంట టిడ్కో సిఈ కృష్ణారెడ్డి, ఆర్డీవో పద్మావతి, పివో చిన్నోడు, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు బదిలీలలో అన్ని ఖాళీలను చూపాలి: ఎపిటిఎఫ్ (1938) వినతి



గుంటూరు: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ పాఠశాల లో కేటగిరి వారిగా పోస్టులను జిల్లా విద్యాశాఖాధి కారులు బ్లాక్ చేస్తున్నారనీ, రాష్ట్ర విద్యాశాఖాధి కారులు ఒక్క ప్రక్క ఏ పోస్ట్ ను బ్లాక్ చేయు మని చెప్పుతుంటే, గుంటూరు జిల్లా లో బ్లాక్ చేయుచున్నారనీ, అయా ప్రయత్నాలను విరమించుకోవాలనీ, వెబ్ ఆప్లక్షన్ కి అన్నిపోస్టులును చూపాలనీ ఎపిటిఎఫ్ (1938) గుంటూరు జిల్లా ప్రదాన కార్య దర్శి మేకల సుబ్బారావు జిల్లా విద్యాశాఖాధి కారిణి శ్రీ మతి శైలజ గారిని వినతిపత్రం లో కోరారు. ప్రాథమికోన్నత పాఠశాల లో రోలు తక్కువని సాకుతో, అక్కడ స్కూల్ అసిస్టెంట్ లను రద్దు చేసి, ఆ స్థానం లో సెకండరీ గ్రేడ్ పోస్ట్ ను ఆమోదింపచేసారు. 1నుండి8 తరగతులకు సరిపడ ఉపాధ్యాయులు లేకపోతే ఎలా భోదన జరుగుతుందినీ జిల్లా అదికారుల కు వివరించారు. మరి ముఖ్యంగా జిల్లా కేంద్రాలకు దగ్గర నున్న పాఠశాల లో నే ఎక్కువ బ్లాక్ చేయుడం పట్ల రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టెబోయిన నరసింహారావు తీవ్రమైన ఆక్షేపన తెలిపారు.

# హిల్ క్రిస్ట్ బంగ్లాను రక్షించండి!



విశాఖపట్నం ప్రజా పాలన ప్రతినిధి : నగరం నడిబొడ్డు సిరిపురం జంక్షన్లో వున్న సిబిసిఎన్సి వారి హిల్ క్రిస్ట్ బంగ్లాను దురాక్రమణ దారుల నుంచి రక్షించాలని సిబిసిఎన్సి ఆస్తుల పరిరక్షణ సమితి కన్వీనర్ సంఘమిత్ర డాక్టర్ ఆర్. ఎస్. జాన్ డిమాండ్ చేశారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సిబిసిఎన్సి ఆస్తులను పరిరక్షించాలనే నినాదంతో ఆ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీబీఐ సి ఎన్ సి ఆస్తుల పరిరక్షణ కమిటీ నాయకులు ఫాల్గొని తమ సంస్థ ఆస్తులను ప్రభుత్వం పరిరక్షించాలని ముక్త కంఠంతో నినదించారు. 1874వ సంవత్సరం మార్చి 12వ తేదీన ఆవిర్భవించిన సీబీఎం సంస్థ క్రమేపీ ప్రజాభిమానం చూరగొందన్నారు. ఈ సంస్థకు గల ఆస్తులను 1975వ సంవత్సరం మద్రాస్ హై కోర్టు తీర్పు ద్వారా సి బి సి ఎన్ సి ట్రస్ట్ అసోసియేషన్ వారికి బదలా యించారన్నారు. 1979వ సంవత్సరంలో తమ సంస్థ సభ్యుల మధ్య ఏర్పడిన భేదాభిప్రాయాల తరువాత బాప్టిస్టులు, బాప్టిస్టేతరులు గా విడిపోయి సిబిసిఎన్సి ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నా రన్నారు. ఈ సంవత్సరం మార్చ్ 26వ తేదీన విశాఖపట్నం ఎంపి ఎంవివి డెవలపర్ ఎం.వి.వి. సత్యన్నారాయణ సిరిపురం జంక్షన్ వద్ద నున్న సిబిసిఎన్సి వారి స్థలంలో వున్న హిల్ క్రిస్ట్ బంగ్లా స్థానంలో ఎం వి.వి పీక్స్ నిర్మాణం కోసం భూమి పూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన ఓఎస్ 18/2009 డిక్రీ నందు టైటిల్ రైట్ ఎవరికీ దఖలు పరచలేదన్నారు. అపీలు నంబర్ 132/2017 ప్రకారం ఆంధ్ర ప్రదేశ్ హై కోర్టు స్టేటస్ కో వుత్తర్వులు ద్వారా త్యాగ రాజ రత్నాకర్ హెగ్డే కొనసాగుతున్నా రన్నారు. కానీ దీనికి సంబంధించిన టైటిల్ సిబిసిఎన్సి కి మాత్రమే కలదన్నారు. 2003వ సంవత్సరం జనవరి 24వ తేదీన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ వ్రాసిన లెటర్ నంబర్ 3010/2002 ప్రకారం 1990వ సంవత్సరం తరువాత సిబిసిఎన్సిలో గల ఏ కమిటీ కూడా గుర్తించ బడలేదన్నారు. ఈ సమస్యలన్నింటినీ గమనించి జిల్లా కలెక్టర్, జీవిఎంసి కమిషనర్, పోలీస్ కమిషనర్ తమ సంస్థ ఆస్తుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎం.ఏ.పాల్, రంజిత్ ఒఫిర్, శ్యాం పాల్, జి.విజయరాజు, డాక్టర్ గెరా హనొక్, కే.మార్టిన్ తదితరులు హాజరై తమ నిరసన తెలిపారు.

## టెన్త్ పరీక్షలకు 745 మంది విద్యార్థులు హాజరు



నూజివీడు, మే 06, ప్రజాపాలన ప్రతినిధి: నూజివీడు పట్టణంలోని ఐదు కేంద్రాలలో టెన్త్ క్లాస్ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగుతున్నట్లు డివైఈవో సేవ్యా తెలిపారు. నూజివీడులో ఆయన మంగళవారం మాట్లాడుతూ నేడు నిర్వహిస్తున్న లెక్కలు పరీక్షకు 860 మంది విద్యార్థులకు గాను 745 మంది విద్యార్థులు హాజరు కాగా, 115 మంది గైర్హాజర్ అయినట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు మంచినీరు, ఎమర్జెన్సీ మెడికల్ కిట్ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఫ్యానుల సౌకర్యం కల్పించినట్లు తెలియజేశారు.

## నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కొనసాగుతున్న సదరన్ క్యాంపులు





నూజివీడు, మే 06, ప్రజాపాలన ప్రతినిధి: నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి మంగళ, శుక్రవారం లలో సదరన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఆర్థోపెడిక్ డాక్టర్ దీప్తి వెల్లడించారు. నూజివీడులో ప్రభుత్వ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ దీప్తి మంగళవారం మాట్లాడుతూ వికలాంగులు ఈ సేవ ద్వారా అన్ని వివరాలను నమోదుతో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఆన్లైన్ ద్వారా పొందిన స్లాట్ ప్రకారం సదరన్ క్యాంపులో పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందించటం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రతి మంగళ, శుక్రవారాలలో ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సదరన్ క్యాంపు కొనసాగుతుందని స్పష్టం చేశారు. పారదర్శకంగా వికలాంగుల ఉపయోగాలు సదరన్ క్యాంపులను నిర్వహించి సర్టిఫికెట్లు అందించటం జరుగుతుందని వివరించారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి వ్యయ ప్రయాసలు పడకూడదని ఉన్నతాధికారుల ఆదేశానుసారం నూజివీడు పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో సదరన్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లుగా తెలియచేశారు. వికలాంగులైన వారు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పూజలు చేస్తున్న మహిళలు



**ఘనంగా సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవం**

బాపట్ల జిల్లా ప్రజా పాలన జూన్ 6: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద గల సాయిబాబా ఆలయం 13 వ సంవత్సర వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయ ట్రెజరీ లోల్ల ఇంద్ర మాట్లాడుతూ 2011లో ఏర్పాటుచేసిన ఆలయం 13 సంవత్సరాల నుంచి విశేషంగా అభివృద్ధి చెందుతూ ప్రతివారం స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 13వ వార్షికోత్సవ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ప్రెసిడెంట్ హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ గొల్లపూడి కాశి విశ్వనాథ్ భక్త బృందం మహిళలు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



నూజివీడు, మే 06, ప్రజాపాలన ప్రతినిధి: మునిసిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు సిపిఎం అనుబంధ కార్మిక సంఘం సిఐటియు ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి సోమయ్య అన్నారు. నూజివీడు మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా మంగళవారం నాడు ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చాపురం నుండి గత నెల 31 వ తేదీన ప్రారంభమైన జాతయాత్ర ఈనెల 8వ తేదీన విజయవాడతో ముగుస్తుందని అన్నారు. రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రి లకు తమ డిమాండ్ తో కూడిన వినతి పత్రం అందించనున్నట్లుగా వివరించారు. నేటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్ర సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేస్తానని ఇచ్చిన హామీ, మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో సైతం ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించిన మున్సిపల్ కార్మికులను నిర్లక్ష్యం చేయడం తగదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి టీ నూకరాజు గార్లపాటి లక్ష్మి, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు రాష్ట్ర కమిటీ సభ్యులు జే ఆర్ నాయుడు, నాయకులు, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో మెరిసిన నూజివీడు విద్యార్థి





నూజివీడు, మే 06, ప్రజాపాలన ప్రతినిధి: నూజివీడు కు చెందిన సీఎంఏ విద్యార్థి కొలిశెట్టి వీరబాబు జాతీయస్థాయిలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ మేనేజ్మెంట్ అకౌంట్స్ వారు నిర్వహించిన తుది పరీక్షలలో 46 వ ర్యాంకు సాధించి అందరి ప్రశంసలు పొందాడు. మండలంలోని మిట్టగూడెం గ్రామంలో గల బృందావన్ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ (బీసీసీఏ) లో సీఎంఏ చదివిన విద్యార్థి కొలిశెట్టి వీరబాబు సాధించిన విజయానికి కళాశాల ఫౌండర్ రవికుమార్, డైరెక్టర్లు కొనకాల మణిదీప్, కొనకాల మాధవరావు, ప్రిన్సిపాల్ వరప్రసాద్ రాణి మేకల అభినందించారు. మరిన్ని అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్కతాలో నిర్వహించిన సిఎంఏ 64వ వార్షికోత్సవ సభలో ఆ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ సివి ఆనంద్ బోస్ చేతుల మీదుగా తమ విద్యార్థి కొలిశెట్టి వీరబాబు గౌరవ పురస్కారాన్ని అందుకోవడం అభినందనీయమన్నారు. కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం జనప గ్రామానికి చెందిన వీరబాబు నేటి విద్యార్థులకు ఆదర్శనీయులుగా పేర్కొన్నారు.

## ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం దశాబ్ది ఉత్సవాలు



గోకవరం. ప్రజా పాలన జూన్ 6: ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013 దశాబ్ది ఉత్సవాలు కార్యక్రమంలో భాగంగా జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివ గణేష్ . కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గోకవరం మండలం మల్లవరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మల్లవరం అంబేద్కర్ నగర్ కమ్యూనిటీ భవనం లో సమావేశ నిర్వహించారు ప్రజలతో మమేకమై తో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం లో పొందుపరిచిన అంశాలను, 10 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం ముగిసిన తర్వాత తెదేపా ప్రభుత్వం, వైసీపీ(జగన్)ప్రభుత్వాల హయాంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని అతిక్రమించి నిధులను దారి మళ్లించి ఎస్సీ ఎస్టీలకు అన్యాయం చేశారని వివరించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013 సంబంధించి పది సంవత్సరాల కాలంలో మొత్తం బ్యాక్లాగ్నిధులను రీ షెడ్యూల్ చేసి ఎస్సీ ఎస్టీ ప్రాంతాల్లో త్రాగునీరు పారిశుధ్యం రోడ్లు విద్యుత్ దీపాలు మొదలైన ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పించాలని సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందించాలని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మరోతీ గణేష్ డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013 బ్యాక్లాగ్ నిధులను రీ షెడ్యూల్ చేయని లేనిచో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వత్సవాయి సత్యనారాయణ రాజు. డాక్టర్ నక్క సత్యనారాయణ, అవసరాల వెంకటాచల . సుధాకర్. చంద్రమౌళి వెంకటరత్నం. కాటే జయ, కిషోర్, గ్రామ పెద్దలు సిద్ధ బత్తుల సాదుబాబు, రాచపల్లి వంశీ, కందికట్ల గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ**



పల్నాడు జిల్లా. నరసరావుపేట. జూన్ 6 (ప్రజాపాలన ప్రతినిధి): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాన్యశ్రీ ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో రాష్ట్ర పర్యటన భాగంగా మంగళవారం నరసరావుపేట పట్టణంలోని స్థానిక ఎన్జీవో హోమ్ లో ఉమ్మడి జిల్లా సమావేశం తో పాటు జులై 7 న జరగబోయే జన జాగృతి మహాసభను విజయవంతం చేయడం కోసం నేడు పల్నాడు జిల్లా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉసురుపాటి బ్రహ్మయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో పాటు మాదిగల సమగ్ర అభివృద్ధి మాదిగల రాజకీయ రంగంలో సమాన వాటా మదిగ కనిపించాలని డిమాండ్ చేశారు. అలాగే జులై 7 తేదీన జరిగే జన జాగృతి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ విషయమై కల్పించి నాదిగలకు న్యాయం చేయాలని కోరారు కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయమై తేల్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనరలు గుండాల ఆనంద్ మాదిగ, డొక్క జార్జి మాదిగ. , రమేష్ మాదిగ., పల్నాడు జిల్లా ఇంచార్జ్ కోట సుబ్బు మాదిగ., పల్నాడు జిల్లా కన్వీనర్ పోలే పోగు రామయ్య మాదిగ. పల్నాడు జిల్లా కోకన్వీనర్ గుండాల నగేష్ మాదిగ. నరసరావుపేట మండల కన్వీనర్ దాసు మాదిగ. రంపచర్ల మండల కన్వీనర్ తాళ్లూరు దేవదానం మాదిగ. నరసరావుపేట పట్టణ కన్వీనర్ నందిగం సాగర్ మాదిగ. పట్టణ కోకన్వీనర్ మిట్ట మహేష్ మాదిగ. పట్టణ నాయకులు. పోలేపాకు రాంబాబు మాదిగ. వివేక మాదిగ రాజా మాదిగ. విజయ మాదిగ. విజయ మాదిగ. సాగర్ మాదిగ. మరియు టౌన్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి సహకార రంగమే ఆశాదీపం...

**సహకార రంగానికి ప్రభుత్వం పెద్ద పీట...**

**పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాలి...**

**సహకార వ్యవస్థ అంటేనే సహకారభూమి పత్రిక గుర్తుకు రావాలి..**

**సహకారభూమి పక్షపత్రిక ఆవిష్కరణలో మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి**






విజయవాడ (ప్రజాపాలన ప్రతినిధి): సహకార రంగం ప్రస్తుతం చాలా చురుగ్గా పనిచేస్తోందని, సహకార రంగంలో ఉపాధి అవకాశాలు కూడా చాలా ఎక్కువగా ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి తెలిపారు. సహకారభూమి జర్నల్ సహకార సంఘం లిమిటెడ్ నెం.జి.3211 విజయవాడ ఆధ్వర్యంలో సహకార సంఘాల కోసం ప్రచురించే "సహకారభూమి" పక్ష పత్రికను మంత్రి నగరంలోని శ్యామ్ నగర్ ఎన్జీవో కాలనీలోని సహకారభూమి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి కాకాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార రంగం పటిష్టతకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఒకప్పుడు గౌరవాభిమానాలతో వెలిగిపోయిన సహకార వ్యవస్థ రానురానూ రాజకీయ నాయకుల పునావాస కేంద్రంగా మారిపోవడం దురదృష్టకరమన్నారు. తమ తండ్రి సహకార సంఘం నుంచి రాజకీయాల్లోకి వచ్చారని గుర్తు చేసుకున్నారు. సహకార వ్యవస్థపై చాలామందికి సరైన అవగాహన లేదని, అలాగే అధికారులకు కూడా




తగినంత పరిజ్ఞానం లేకపోవడం వల్ల సహకార వ్యవస్థ దెబ్బతిన్నదని ఆయన అన్నారు. సహకార వ్యవస్థను పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి 298 కోట్ల రూపాయలు నిధిని కేటాయించారని,అనుభవం ఉన్న సహకారవాదులు, జర్నలిస్టులు తీసుకొస్తున్న సహకారభూమి పత్రిక విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వానికి, సహకార వ్యవస్థకు సహకారభూమి ఒక అస్త్రంగా నిలవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం, అలాగే సహకార మంత్రిత్వ శాఖ సహకారభూమి పక్షపత్రికకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి కాకాణి ఈసందర్భంగా ప్రకటించారు. సహకార రంగ పటిష్టతకు సహకారభూమి లాంటి పత్రికలు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని చెప్పారు. సహకారం అంటే అపకారం కాదనీ, సహకార రంగంలో ఎందరు సభ్యులు ఉంటే అందరి సంక్షేమమవే ప్రధాన ధ్యేయంగా ఈ రంగం పని చేస్తుందని కొనియాడారు. సహకార రంగంలో నెలకొన్న స్తబ్దతను పోగొట్టేందుకు సహకారభూమి పత్రిక, ఇతర సమాచార మాధ్యమాలు కృషి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. సహకార రంగంలో ఉపాధి లభించాలంటే ఆ రంగ పటిష్టతకు కృషి చేయాలని, సహకార రంగం ఆధునికీకరణకు తమవంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. దీనికి అందరూ కలిసిరావాలని ఆయన కోరారు. సహకార వ్యవస్థ అంటేనే సహకారభూమి పత్రిక గుర్తురావాలని, ఆవిధంగా మీ కృషి కొనసాగాలని మంత్రి కాకాణి ఆకాంక్షించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సహకార రంగంలో తమ బ్యాంకు సాధించిన ప్రగతిని వివరించారు. సహకారభూమి పక్ష పత్రికకు తాము అన్నివిధాలా సహకరిస్తామని చెప్పారు. తమ పరిధిలోని సహకార సంఘాలన్నీ ఈ పత్రికకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ దేవినేని అవినాష్ సందేశమిస్తూ.. సహకార రంగంలో పత్రిక రావడం ముదావహమని, సీనియర్ జర్నలిస్టులు ఈ పత్రికను తీసుకురావడానికి సంకల్పించినందుకు అభినందించారు. సహకార రంగ పటిష్టతకు ఈ పత్రిక దోహదం చేయగలదని ఆకాంక్షించారు. సహకారభూమి వ్యవస్థాపకులు దాసరి కేశవులు మాట్లాడుతూ ఈ పత్రిక లక్ష్యాలను వివరించారు. చరిత్రలో సహకారభూమి ఒక మైలురాయిగా నిలవగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లాలో ఆదర్శవంతంగా నడుస్తున్న ఎలకుర్రు కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, పత్రికాధిపతి దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు మనవడు కాశీనాథుని నాగేశ్వరరావుని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం నాయకుడు పి. జమలయ్య, సీనియర్ పాత్రికేయులు ఆకుల అమరయ్య, సహకారభూమి సంపాదకులు అక్బర్ పాషా, సహకారభూమి సొసైటీ కార్యదర్శి వీరమాచనేని రత్న ప్రసాద్, కోశాధికారి ఏ ఎల్లారావు, వ్యవస్థాపక సంపాదక మండలి సభ్యులు కెవి కృష్ణ, కె ఎస్ జ్యోతిశ్రీ, టీవీ నరసింహారావు, జివి రంగారెడ్డి, డి స్వాతి, మాధవి, రవీంద్ర రెడ్డి, సీతారామయ్య, వైద్య ప్రముఖులు, ప్రముఖ రచయిత డాక్టర్ జివి పూర్ణచంద్, సీనియర్ జర్నలిస్టులు, సహకార రంగ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమపై సైకిల్ గురి

తిరుపతి, జూన్ 6, :ఏపీలో ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం దూకుడుగా వ్యవహరిస్తోంది. ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ఇటీవల మహానాడు రెండో రోజు టీడీపీ మినీ మేనిఫెస్టో ప్రకటించింది. అందులో 6 కీలక హామీలు ఉండగా, దసరా సమయానికి వచ్చే ఎన్నికలకు పూర్తి స్థాయి మేనిఫెస్టోను పార్టీ అధినేత చంద్రబాబు ప్రజల ముందుకు తీసుకురానున్నారు. మరోవైపు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతంగా కొనసాగుతోంది. రాయలసీమలో పాదయాత్ర పూర్తి కావస్తున్న సందర్భంగా నారా లోకేశ్ సీమ మొత్తానికి 3 కీలక హామీలను ప్రకటించనున్నారని తెలుస్తోంది. సీమకు చెందిన టీడీపీ నేతలతో చర్చించి చంద్రబాబు ఈ విషయాలను ఖరారు చేశారని సమాచారం.టీడీపీ మిషన్ రాయలసీమ పేరుతో నారా లోకేష్ త్వరలోనే సీమ ప్రజలకుగానూ మూడు హామీలు ఇవ్వనున్నారని తెలుస్తోంది. మిషన్ రాయలసీమ ప్రణాళికలో భాగంగా అన్నదాత ఆదాయం రెండింతలు చేయడం, నీటి వినియోగం ప్రతీ ఒక్కరి హక్కు, రాయలసీమను యువతకు ఉపాధి కేంద్రంగా మార్చుతామని యువగళం పాదయాత్రలో లోకేష్ ప్రకటించనున్నారని సమాచారం. కడప మునిసిపల్ కార్పొరేషన్ లో రాజ రాజేశ్వరి కళ్యాణ మండపం వేదికగా జరగనున్న కార్యక్రమంలో లోకేష్ ఈ 3 హామీలపై ప్రకటన చేసే అవకాశం ఉంది. ఈ ప్రకటన వచ్చే వరకు ఇందులో ఏమైనా మార్పులు చేసే దిశగా పార్టీ కీలక నేతలు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో కమలాపురం నేతలు తెలుగుదేశం పార్టీలో చేరారు. చెన్నముక్కపల్లి విడిది కేంద్రంలో కమలాపురం నియోజకవర్గం తప్పెట్ల గ్రామానికి చెందిన సర్పంచ్ గడికోట శాంతి, భర్త సుధాకర్ రెడ్డి, గండిరెడ్డిపల్లికి చెందిన మాజీ సర్పంచులు.. గాలి ప్రసాద్ రెడ్డి, దర్శన్ రెడ్డి, మిట్టపల్లికి చెందిన మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, గోనుమాకపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ శేఖర్ రెడ్డి, అంబవరం మాజీ ఎంపీటీసీ ముంతా జానయ్య, సీనియర్ నేతలు రామసుబ్బారెడ్డి, నాగేంద్ర రెడ్డి, దళిత నేతలు కొప్పుల జగన్, అనిల్, చంటితో పాటు పలువురు దళిత యువకులు సోమవారం లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు యువ నేత లోకేష్.ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కమలాపురంలో గెలుపేలక్ష్యంగా టీడీపీ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. రాక్షసపాలనను అంతమొందిస్తేనే కడప జిల్లా వాసులకు స్వేచ్ఛ కలుగుతుందన్నారు. సీఎం సొంత జిల్లాలోనే ప్రజల్లో తీవ్రస్థాయిలో అసంతృప్తి ఉందని, కడప జిల్లాలోనూ జగన్ పనైపోయిందని లోకేష్ వ్యాఖ్యానించారు. సీఎం జగన్ ను నమ్ముకున్నవారే వైసీపీ నుండి బయటకు వస్తున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ జగన్ కు కడప జిల్లాలో ఎదురుగాలి వీచిందని గుర్తుచేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వారు లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. మిట్టపల్లికి చెందిన 20 కుటుంబాలు, గంగిరెడ్డిపల్లికి చెందిన 30 కుటుంబాలు, గోనుమాకులపల్లికి చెందిన 30 కుటుంబాలు, అలిదిన, పాయసంపల్లి, పడదుర్తి, చడిపిరాళ్లకు చెందిన ఎస్సీలు, ఎస్ఆర్ నగర్, జెబి నగర్ కాలనీ, ఉప్పర్పల్లికి చెందిన 40 కుటుంబాలు, తోలగంగనపల్లికి చెందిన 8 కుటుంబాల వారితో పాటు పలువురు టీడీపీలో చేరారు.

## ఏపీకి బీజేపీ జాతీయ నేతలు

విశాఖపట్టణం, జూన్ 6, :కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆంధ్రప్రదేశ్ పర్యటన వాయిదా పడింది. ఈ విషయాన్ని బీజేపీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు వెల్లడించారు. తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం అమిత్ షా జూన్ 8న విశాఖకు రావాల్సి ఉంది. అయితే అమిత్ షా పర్యటన జూన్ 11వ తేదీకి వాయిదా పడిందని సోము వీర్రాజు తెలిపారు. దాంతో 11వ తేదీన విశాఖలో జరగనున్న అమిత్ షా బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో అమిత్ షా, జేపీ నడ్డాలతో భేటీ కావడంతో ఈ బీజేపీ నేతల ఏపీ పర్యటనపై ఉత్కంఠ నెలకొంది.ప్రధాని నరేంద్రమోదీ 9 ఏళ్ల పాలనపై నెల రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బీజేపీ అగ్రనేతలు ఏపీలో పర్యటించనున్నారు. మొదట హోంమంత్రి అమిత్ షా, తరువాత బీజేపీ అధ్యక్షుడు నడ్డా చెరో బహిరంగసభలో ప్రసంగించేలా ప్లాన్ చేసింది బీజేపీ. అయితే ఈ నెల 8వ తేదీన విశాఖపట్నం రావాల్సిన అమిత్ షా పర్యటన 11కు వాయిదా పడింది. మోదీ ప్రభుత్వం సాధించిన తొమ్మిదేళ్ల విజయాలపై బహిరంగసభ ఏర్పాటు చేస్తోంది ఏపీ బీజేపీ. ఈ సభలో అమిత్ షా ప్రసంగించనున్నారు. అంతకు ఒకరోజు ముందే, జూన్ 10వ తేదీన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తిరుపతికి రానున్నారు. తిరుపతిలో పార్టీ నేతలు ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగించనున్నారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ పై దృష్టి పెట్టాలని బీజేపీ అగ్రనేతలు నిర్ణయించుకున్నారని అందుకే ఇద్దరు అగ్రనేతలు మూడు రోజులలో ఏపీలో పర్యటించాలని భావిస్తున్నారు. బీజేపీ అగ్రనాయకత్వం తెలంగాణ విషయంలో చాలా సమావేశాలు నిర్వహిస్తోంది కానీ.. ఇంకా ఏపీ విషయంలో మాత్రం పూర్తి స్థాయిలో వ్యూహాలు ఖరారు చేయడం లేదు. ఎన్నికలు ముంచుకు వస్తున్న సమయంలో బీజేపీతో పొత్తుల కోసం రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయన్న ప్రచారం జరుగుతోంది. అంతా ఢిల్లీ స్థాయిలో ఏదో జరుగుతోందని చెబుతున్నారు కానీ రాష్ట్ర నేతలకు పెద్దగా సమాచారం ఉండటం లేదు. పొత్తుల విషయంలో హైకమాండ్ దే తుది నిర్ణయమని.. వారు ఏం చెబితే దాన్ని పాటిస్తామని రాష్ట్ర నేతలు అంటున్నారు. ఇప్పటికే తాము జనసేనతో మాత్రమే ఉన్నామంటున్నారు. ఏపీ బీజేపీ నేతలు పార్టీని బలోపేతం చేసుకునేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నారు. హైకమాండ్ నిర్దేశించిన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నారు. గతంలో ఆరేడు వేల స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించిన బీజేపీ.. ఇటీవల ప్రజా చార్జిషీట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పెద్ద ఎత్తున బీజేపీ ప్రభుత్వ విజయాలను కూడా ప్రచారం చేశారు. తాజాగా .. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి 9 ఏళ్లయిన సందర్భంగా నవ వసంతాలు – నవ కుసుమాల పేరిట తొమ్మిది విజయాలను భారీ స్థాయిలో ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఏపీ బీజేపీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి నేతృత్వంలో గత నెల 30 వతేదీ నుంచి ఈ ప్రచారం ప్రారంభమయింది.

## పోలవరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి..

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్ట్ నిర్మాణంలో సహజంగానే చిన్న సమస్యలు వస్తాయని ముఖ్యమంత్రి చెబుతూ వాటిని గమనించుకుంటూ ఎప్పటికప్పుడు పునర్నిర్మాణం చేసుకుంటూ ముందుకు సాగాలని సీఎం సూచించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎగువ కాఫర్ డ్యాంలో ఖాళీలు వదిలారని ఈ ఖాళీలు గుండా వరదనీరు అతివేగంతో ప్రవహించడం వల్ల ప్రాజెక్టు నిర్మాణాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఎస్ఆర్ఎఫ్ డాం నిర్మాణానికి కీలకమైన డయాఫ్రం వాల్ దారుణంగా దెబ్బతిన్నారు. దీనివల్ల ప్రాజెక్టు ఆలస్యం కావడమే కాదు అదనంగా 2000 కోట్లు– రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చిందని ఆయన వెల్లడించారు.పోలవరం ప్రాజెక్టులో కీలక పనులు ప్రగతిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. స్పిల్ వే కాంక్రీట్ పూర్తయిందని 48 రేడియల్ గేట్లు పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగిందని రివర్ స్లూయిస్ గేట్లు పూర్తయ్యాయని ఎగువ కాఫర్ డ్యాం, దిగువ కాఫర్ డాం పూర్తయిందని గ్యాప్ 3 వద్ద కాంక్రీట్ డ్యాం పూర్తయిందని అలాగే పవర్ హౌస్ లో సొరంగాల తవ్వకం పూర్తయిందని అప్రోచ్ ఛానల్ పనులు దాదాపుగా పూర్తిగా వచ్చాయని వివరించారు. దెబ్బతిన్న గ్యాప్ వన్ ప్రాంతంలో ఇసుక నింపే కార్యక్రమం పూర్తయినట్లు ఆ ప్రాంతంలో వైబ్రో కాంపెక్షన్ కూడా పూర్తయిందని పేర్కొన్నారు. ఈసిఆర్ఎఫ్ గ్యాప్ 2 ప్రాంతంలో నింపడానికి అవసరమైన 100??? ఇసుక రవాణా పూర్తి అయినట్లు అధికారులు వివరించారు.నిర్వాసిత కుటుంబాల్లో 12658 కుటుంబాలను ఇప్పటికే తరలించామని అధికారులు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం నిర్వాశితులందరిని వీలైనంత త్వరగా తరలించాలని సీఎం ఆదేశించారు దెబ్బతిన్న డయాఫ్రం వాళ్ళని త్వరగా పూర్తి చేయాలని ఇది పూర్తి అయితే మెయిన్ డాంచురుగ్గా కొనసాగడానికి అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. డిసెంబర్ కల్లా పనులు పూర్తి చేయడానికి కార్యాచరణతో ముందుకు వెళుతున్నట్లు– అధికారులు వివరించారు నిర్వాసిత కుటుంబాలకు పునరావసంపై సమీక్షిస్తూ పునరావాస కాలనీలో అన్ని అన్నిసౌకర్యాలు ఏర్పాటు– చేయాలని సీఎం ఆజేశించారు. కాలనీలు పూర్తవుతున్న సమయంలోనే సమాంతరంగా సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు నిర్వాసిత కుటుంబాల్లో 12658 కుటుంబాలను ఇప్పటికే తరలించామని అధికారులు తెలపగా షెడ్యూల్ ప్రకారం నిర్వాసిత కుటుంబాల అందరిని తరలించేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దాలని, పోలవరం వద్ద మంచి బ్రిడ్జిని నిర్మించాలని పర్యాటకులు ఉండేందుకు మంచి సదుపాయాలు ఇక్కడ హోటల్ ఏర్పాటు కూడా చేయాలని మౌలిక సదుపాయాలు ఏర్పాటుతో మంచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## ఏపీలో పవన్ కల్యాణ్ దూకుడు..

(మొదటి పేజీ తరువాయి)

ఒకటి రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో విస్తృతంగా.. విడతల వారీగా పర్యటించాలన్నది ఒక కారణంగా భావిస్తుండగా.. రెండోది ఏపీలో ముందస్తు ఊహాగానాలు బలంగా వినిపించడమని తెలుస్తోంది. ఇటీవల కాలంలో ఏపీలో ముందస్తు అసెంబ్లీ ఎన్నికలు రావచ్చన్న వార్తలు ఓ మోస్తరుగానే వస్తున్నాయి. జగన్ మదిలో ముందస్తు యోచన వుందని, దాని ప్రకారం 2023 నవంబర్, డిసెంబర్ నెలల్లో జరిగే అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటే ఏపీకి అసెంబ్లీకి ఎన్నికలు జరిపితే తమకు అనుకూలంగా ఫలితం వచ్చే అవకాశం వుంటుందని ఆయన భావిస్తున్నారని చెప్పుకుంటున్నారు. సీనియర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంటి వారు ముందస్తు యోచన లేనే లేదని కాస్త గట్టిగానే చెబుతున్నా.. ఈ ఊహాగానాలు మాత్రం ఆగడం లేదు. ఒక వేళ సీఎం జగన్ ముందస్తు ఎన్నికలకు వెళ్ళాలని భావిస్తే దానికి అనుగుణంగా తమ పార్టీ సిద్ధంగా వుండాలని భావించడం వల్లనే పవన్ కల్యాణ్ జూన్ నెలలోనే ప్రచార పర్వానికి శ్రీకారం చుడుతున్నారని కొందరు విశ్లేషిస్తున్నారు.

జనసేన ప్రతిపాదనకు కార్యరూపం!

గత కొంత కాలంగా పవన్ కల్యాణ్ ఏపీలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదన్న అంశాన్ని పదే పదే చెబుతున్నారు. దానికి అనుగుణంగా జనసేన, టీడీపీ, బీజేపీలు కలిసి అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొంటే వైసీపీని ఇంటికి పంపవచ్చన్నది జనసేనాని వ్యూహమని తెలిసిపోతూనే వుంది. తాను బలిపశువు కాబోనంటూనే సీట్ల సర్దుబాటుపై నిక్కచ్చిగా బలాబలాలను పరిగణనలోకి తీసుకోవాలన్న అభిమతాన్ని వ్యక్తం చేస్తున్నారు. 2014 నాటి అలయెన్స్ రిపీట్ అయితే జగన్‌ను నిలువరించవచ్చని ఆయన భావిస్తున్నారు. అయితే 2014లో జనసేన పార్టీ.. బీజేపీ–టీడీపీ కూటమికి మద్దతు ప్రకటించి, ఎన్నికల్లో పోటీకి దూరంగా వుంది. ఆ తర్వాత 2019 నాటికి ఏపీలో రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. జనసేన అటు టీడీపీకి, ఇటు బీజేపీకి దూరం జరిగి, వామపక్షాలతో కలిసి అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొని చతికిలా పడింది. జనసేనాని పవన్ కల్యాణ్ రెండు నియోజకవర్గాలలో పోటీ చేసినా ఒక్కచోట గెలువలేకపోయారు. మొత్తమ్మీద ఒకే ఒక ఎమ్మెల్యేను జనసేన గెలిపించుకోగలిగింది. ఆ గెలిచిన రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ కూడా జనసేనలో ఎంతో కాలం వుండలేదు. అధికార పార్టీలో దాదాపు చేరిపోయారు. ఇలా ఒక్క ఎమ్మెల్యే కూడా లేని జనసేన పార్టీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కుంభస్థలాన్ని కొట్టే భారీ లక్ష్యాన్ని పెట్టుకున్నారు. అయితే ప్రస్తుతం కనబరుస్తున్న దూకుడు పవన్ కల్యాణ్‌లో సీట్ల సర్దుబాటు నాటికి వుంటుందా లేదా అన్న ఆసక్తి రేపుతోంది. సీట్ల బేరసారాల్లో చాణక్యనీతిని ప్రదర్శించే చంద్రబాబుతో సమాలోచనలంటే ఆషామాషీ కాదు. 2014 ఎన్నికల్లో మోదీ చరిష్మాను చూపడం ద్వారా 35 సీట్లు పొందాలని భావించిన బీజేపీని చంద్రబాబు కేవలం 16 సీట్లకు పరిమితం చేశారు. గెలిచిన తర్వాత నాలుగు మంత్రి పదవులు ఆశిస్తే కేవలం రెండిచ్చి ఇక చాలని కమలనాథులకు చెప్పేశారు చంద్రబాబు. అలాంటిది ప్రస్తుత అసెంబ్లీలో ఒక్కరంటే ఒక్క ఎమ్మెల్యే లేని జనసేనకు చంద్రబాబు ఎన్ని సీట్లు కేటాయిస్తారనేది ఆసక్తి రేపే అంశమే.

## తొలకరిలో రైతుకు అదృష్టం..

(మొదటి పేజీ తరువాయి)

అయితే చివరకు గుత్తికి చెందిన వ్యాపారి ఒకరు రూ.2 కోట్లకు ఆ వజ్రాన్ని కొనుగోలు చేసినట్టుగా ప్రచారం సాగుతోంది.అయితే ఈ సీజన్‌లో లభించిన అత్యంత విలువైన వజ్రంగా దీనిని చెబుతున్నారు. సాధారణంగా లక్షల రూపాయలు విలువ చేసే వజ్రాలు ఈ ప్రాంతంలో దొరుకుతాయని.. కానీ రూ.2 కోట్ల విలువైన వజ్రం లభించడం అరుదు అని స్థానికులు తెలిపారు. దీంతో ఆ ప్రాంతంలో రైతులు, స్థానికులు పొలాల్లో వజ్రాల వేటను మరింత ముమ్మరం చేశారు.

## ఘనంగా సత్తెనపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు కాపు గంటి రత్తయ్య జన్మదిన వేడుకలు



సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి: అనగా ది 06.06.23 తేదీ,మంగళవారం ఉదయం గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘము మాజీ అధ్యక్షులు పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ ఆధ్వర్యంలో వారి షాప్ లో కాపుగంటి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎంతో సౌమ్యంగా, అందరితో స్నేహ భాగంగా ఉండే సున్నితమైన మనస్సు కలిగిన నాయకులు అనిఅన్నారు. కాపుగంటి గారి పదవీ కాలంలో సత్తెనపల్లి పట్టణంలో శరబయ్య గుప్తా హేందవోన్నత పాఠశాల లో బారీ మొత్తంలో ఆర్యవైశ్య కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్యవైశ్య ఆఫీషియల్స్ మరియు ప్రొఫైషనల్స్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వెల శ్రీనివాసరావు, ముప్పాళ్ల మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు పోతుగంటి నరసింహారావు,సత్తెనపల్లి వాసవి సేవా సమితి అధ్యక్షులు దేవరశెట్టి రవికుమార్, యువ న్యాయవాది దేవిశెట్టి శరత్,ఆర్యవైశ్య చలివేంద్ర సంఘము కార్యవర్గ సభ్యులు చిలకల వాసు,పెరుమాళ్ళ మణి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ.రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్:www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును
ఓపెన్ ఇ-టెండరు నోటీస్ నం. DRM/Works/BZA/15/2023, తేది: 05-06-2023
PUB/0587
భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకందారు దిగువ పనుల కొరకు ప్రతి దానికి ఎదురుగా తెలిపిన తేదీన, 15.00 గం. వరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.
క్ర.సం.1, టెండరు నం.: E-33-East-BZA-2023, పని వివరాలు- పని పేరు: రాయనపాడు- 75mx80m ద్వారా స్ట్రిప్పింగ్ షాప్ యొక్క రీ-ఫ్లోరింగ్. పూర్తి చేయు కాలం: 9 (తొమ్మిది) నెలలు, టెండరు విలువ: రూ. 1,45,68,604/-, బయానా: రూ. 2,22,900/-, ముగింపు తేది: 19-06-2023.
క్ర.సం.2, టెండరు నం.: E-34-East-BZA-2023, పని వివరాలు- పని పేరు: విజయవాడ డివిజన్: అమృత్ భారత్ స్టేషన్ పథకం క్రింద SW-I: ADEN/BVRM సబ్ డివిజన్ పరిధిలోని SEE/W/BVRM సెక్షన్‌లో ప్రస్తుతమున్న FOBకి అనుసంధానం కొరకు తణుకు (2 నం.లు), ఆకివీడు (2 నం.లు) మరియు కైకలూరు (2 నం.లు) స్టేషన్ల వద్ద 6 లిఫ్ట్‌లు ఏర్పాటు చేయుట. SW-II: ADEN/Lines/BZA సబ్ డివిజన్ పరిధిలోని SEE/W/BZA సెక్షన్‌లో ప్రస్తుతమున్న FOBకి అనుసంధానం కొరకు రాయనపాడు (2 నం.లు) స్టేషన్ వద్ద 2 లిఫ్ట్‌లు ఏర్పాటు చేయుట. పూర్తి చేయు కాలం: 9 (తొమ్మిది) నెలలు, టెండరు విలువ: రూ. 2,03,98,436/-, బయానా: రూ. 2,52,000/-, ముగింపు తేది: 28-06-2023.
క్ర.సం.3, టెండరు నం.: E-11-North-BZA-2023, పని వివరాలు- పని పేరు: విజయవాడ డివిజన్: అమృత్ భారత్ స్టేషన్ పథకం క్రింద DEN/North/BZA అధికార పరిధిలోని ఎలమంచిలి (PF-1) వద్ద ప్లాట్ ఫారం విస్తరించుట మరియు కాకినాడ టౌన్, సామర్లకోట, అనపర్తి, అనకాపల్లి, ఎలమంచిలి, తుని మరియు నిడదవోలు (7 స్టేషన్లు) వద్ద ప్లాట్ ఫారం సర్ఫేస్‌లకు అభివృద్ధి పనులు. పూర్తి చేయు కాలం: 9 (తొమ్మిది) నెలలు, టెండరు విలువ: రూ. 25,38,24,906/-, బయానా: రూ. 14,19,100/-, ముగింపు తేది: 23-06-2023.
క్ర.సం.4, టెండరు నం.: E-12-North-BZA-2023, పని వివరాలు- పని పేరు: SW-I: ABS పథకం క్రింద తుని, ఎలమంచిలి మరియు అనపర్తి రైల్వే స్టేషన్లలో పురుషులు, స్త్రీలు, దివ్యాంగులు కొరకు విడివిడిగా ప్రత్యేక ఆధునిక మరుగుదొడ్లు (13.0 x 14.5=188.50 చ.మీ.) మరియు వెయిటింగ్ హాల్ (10x 10=100 చ.మీ.) ఏర్పాటు. SW- II: ABS పథకం క్రింద నిడదవోలు, సామర్లకోట, కాకినాడ టౌన్ మరియు అనకాపల్లి రైల్వే స్టేషన్లలో పురుషులు, స్త్రీలు, దివ్యాంగులు కొరకు విడివిడిగా ప్రత్యేక ఆధునిక మరుగుదొడ్లు (13.0 x 14.5=188.50 చ.మీ.) మరియు వెయిటింగ్ హాల్ (20x 10=200 చ.మీ.) ఏర్పాటు. పూర్తి చేయు కాలం: 9 (తొమ్మిది) నెలలు, టెండరు విలువ: రూ. 11,24,87,350/-, బయానా: రూ. 7,12,400/-, ముగింపు తేది: 23-06-2023.
క్ర.సం.5, టెండరు నం.: E-16-South-BZA-2023, పని వివరాలు- పని పేరు: విజయవాడ డివిజన్ -ఇరువైపుల 200 మీ. పొడవున అప్రోచ్ ట్రాక్ లను తగువిధంగా లిఫ్ట్ చేస్తూ విజయవాడ-గూడూరు సెక్షన్ లోని గూడూరు (GDR) మరియు మనుబోలు (MBL) స్టేషన్ల మధ్య కి.మీ. 136/33-35 వద్ద వంతెన నం. 271A అప్ &డౌన్ లైన్ల కొరకు PSC స్లాబ్స్‌తో స్టీల్ ప్లేట్ గిర్డర్లు కలిగిన ప్రస్తుతం ఉన్న స్పాన్ యొక్క ప్రతిపాదిత రీప్లేస్‌మెంట్. పూర్తి చేయు కాలం: 6 (ఆరు) నెలలు, టెండరు విలువ: రూ. 1,42,53,991/-, బయానా: రూ. 2,21,300/-, ముగింపు తేది: 26-06-2023.
క్ర.సం.6, టెండరు నం.: E-17-South-BZA-2023, పని వివరాలు- పని పేరు: Sr.DEN/South/BZA అధికార పరిధిలోని ADEN/NLR సబ్ డివిజన్‌లో వివిధ లొకేషన్ల వద్ద ట్రిప్లింగ్/డబ్లింగ్ సెక్షన్ (పూర్తయిన/పూర్తి కాని) గూడూరు - విజయవాడ (డౌన్)= 3.509 కి.మీ.లలో ట్రాఫిక్‌ను మళ్లిస్తూ కంటిన్యూస్ స్ట్రెచ్‌లో బ్లాంకెటింగ్ మెటీరియల్‌తో TFTR 3.509 కి.మీ.ల పొడవున వీక్ ఫార్మేషన్ యొక్క రీహాబిలిటేషన్. పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు, టెండరు విలువ: రూ. 4,23,79,942/-, బయానా: రూ. 3,61,900/-, ముగింపు తేది: 26-06-2023.
క్ర.సం.7, టెండరు నం.: E-17-Bridges-BZA-2023, పని వివరాలు- పని పేరు: విజయవాడ-విశాఖపట్నం సెక్షన్ : DEN/Br/BZA పరిధిలోని ADEN/Br/North/BZA యొక్క SSE/Br.II/RJY సెక్షన్‌లో సెక్షనల్ బ్రిడ్జ్‌లు పటిష్టపరుచుట (8 డౌన్, 9 అప్, 10 అప్, 11 అప్, 13 అప్, 13 డౌన్, 57 అప్, 104 అప్, 220 డౌన్, 220 అప్, 236 అప్, 236 డౌన్, 239 అప్, 239 డౌన్, 245 అప్, 245 డౌన్ - 16 బ్రిడ్జ్‌లు). పూర్తి చేయు కాలం: 14 (పద్నాలుగు) నెలలు, టెండరు విలువ: రూ. 4,33,49,920/-, బయానా: రూ. 3,66,800/-, ముగింపు తేది: 03-07-2023.
1) కాగోరు టెండరుదారులను ఏదైనా టెండరుకు ఏవైనా మార్పులు/ సవరణ గమనించుటకు టెండరు ముగింపు తేదీకి ముందు వెబ్‌సైట్ www.ireps.gov.inను దర్శించాలని కోరడమైనది.
డివిజనల్ రైల్వే మేనేజర్ (పనులు), విజయవాడ

## నిమ్మల అరెస్టును ఖండించిన సీతారామలక్ష్మి



భీమవరం జూన్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) :పాలకొల్లు నియోజకవర్గంలోని యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో దళితుల భూములలో అక్రమ మట్టి మాఫియా చర్యలను అడ్డుకున్న పాలకొల్లు శాసనసభ్యుడు నిమ్మల రామానాయుడును పోలీసులు అక్రమ అరెస్ట చేయడాన్ని పశ్చిమగోదావరి జిల్లా తెదేపా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇంచార్జ్ తోట సీతారామలక్ష్మి ఖండించారు. దళితల ఓట్లతో గద్దెనెక్కిన జగన్ దళితుల ఆస్తులను, భూములను కబ్జా చేస్తూ దళితుల సంక్షేమ పథకాలను రద్దుచేసి దళితులకు తీవ్ర అన్యాయం చేశారని ఆమె విమర్శించారు. చించినాడ గోదావరి లంకభూములలో వైసిపి అధికార పార్టీ నాయకులు దళితుల భూములను కొట్టేస్తున్నందున దళితులకు రక్షణగా బాధితులతో, కమ్యూనిస్టు పార్టీలతో కలిసి ధర్నా చేస్తున్న డాక్టర్ నిమ్మల రామానాయుడును పోలీసులు అక్రమంగా అరెస్ట చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్రవ్యాప్తంగా దళితులు త్వరలో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె నింపనున్నారని సీతారామలక్ష్మి తెలిపారు.

ఓపెన్ ఇ-టెండరు నోటీస్ నం. DRM/Works/BZA/14/2023, తేది: 31-05-2023
PUB/0588
భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకందారు దిగువ పనుల కొరకు ప్రతి దానికి ఎదురుగా తెలిపిన తేదీన, 15.00 గం. వరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.
క్ర.సం.1, టెండరు నం.: E-02-TM-Lines-BZA-2023, పని వివరాలు- పని పేరు: దక్షిణ మధ్య రైల్వేలోని ట్రాక్ మెషిన్ స్టాఫ్ కొరకు క్యాంపింగ్ కోచ్ లలోకి 40 నంబర్ల ART/జనరల్/స్లీపర్ లేదా ఏదైనా ఇతర రకం కోచ్‌లు మార్చుట. పూర్తి చేయు కాలం: 18 (పద్దెనిమిది) నెలలు, టెండరు విలువ: రూ. 8,65,70,019/-, బయానా: రూ. 5,82,900/-, ముగింపు తేది: 19-06-2023.
1) కాగోరు టెండరుదారులను ఏదైనా టెండరుకు ఏవైనా మార్పులు/ సవరణ గమనించుటకు టెండరు ముగింపు తేదీకి ముందు వెబ్‌సైట్ www.ireps.gov.inను దర్శించాలని కోరడమైనది.
డిప్యూటీ చీఫ్ ఇంజినీర్/TM/లైన్స్, విజయవాడ
A0835
తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inను దర్శించండి.

## ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013 దశాబ్ది ఉత్సవాలు..



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి.లిఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013 దశాబ్ది ఉత్సవాలులి కార్యక్రమంలో భాగంగా నేడు లిజగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివ గణేష్‌లి మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం మల్లవరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మల్లవరం అంబేద్కర్ నగర్ నందు గల కమ్యూనిటీ భవనం నందు మరియు మల్లవరం కలిజోళ్ళ పేట అంబేద్కర్ నగర్ నందు గల కమ్యూనిటీ సమావేశ మందిరం నందు ప్రజలతో మమేకమై ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం లో పొందుపరిచిన అంశాలను, 10 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను జరుపుకోవలసిన అవసరతను వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం ముగిసిన తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం, వైసీపీ(జగన్)ప్రభుత్వాల హయాంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని అతిక్రమించి నిధులను దారి మళ్లించి ఎస్సీ ఎస్టీలకు అన్యాయం చేశారని వివరించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013 సంబంధించి పది సంవత్సరాల కాలంలో మొత్తం బ్యాక్లాగ్నిధులను రీ షెడ్యూల్ చేసి ఎస్సీ ఎస్టీ ప్రాంతాల్లో త్రాగునీరు పారిశుధ్యం రోడ్లు విద్యుత్ దీపాలు మొదలైన ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పించాలని సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందించాలని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని తెలియజేశారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013 బ్యాక్లాగ్ నిధులను రీ షెడ్యూల్ చేయని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వత్సవాయి సత్యనారాయణ రాజు అనే బాబు, డాక్టర్ నక్క సత్యనారాయణ, అవసరాల వెంకటాచల సుధాక,ర్ చంద్రమౌళి వెంకటరత్నం అనే చిన్నారి, కాటే జయ, కిషోర్, గ్రామ పెద్దలు సిద్ధ బత్తుల సాదుబాబు, రాచపల్లి వంశీ, కందికట్ల గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు..

## రైతు కుటుంబానికి 7 లక్షలుప్రభుత్వ సాయం అందించిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ జూన్ 6 ప్రజా పాలన ప్రతినిధి: పట్టణంలో ని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వెలది కొత్తపాలెం గ్రామానికి చెందిన కాలితిరిపి వెంకటేష్ రెండు నెలల కింద అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో ఆయన భార్య కా లితిరిపి వాణికి ప్రభుత్వం ఎక్స్ గ్రేషియో కింద మం జూరు చేసిన రూ.7 లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు మంగళ వా రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఏ అన్నదాతకూ ఆత్మహత్య చేసుకునేంత దుస్థి తి రాకూడదని అనుకోని పరిస్థితుల్లో ఆత్మహత్యకు పాల్పడితే.పాలకులు ఆ కుటుంబాన్ని అక్కున చే ర్చుకుని భరోసా ఇవ్వాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ.7 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. రైతులెవరూ అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని, రైతుల సం క్షేమం, అభివృద్ధి కోసం వైయస్ జగన్ పని చేస్తు న్నా రని, రైతును రాజును చేయాలనే ఉద్దేశంతోప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుం దన్నారుఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతోటి వీరప్రసాద్, యార్లగడ్డ సత్యనా రాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ జూన్ 6 ప్రజా పాలన ప్రతినిధి: పట్టణం లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏపీ మార్క్ ఫె డ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పసుపు కొనుగోలు కేంద్రాన్ని శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు మంగళవారం ప్రారంభించారు ముందుగా పసుపు పంట దిగుబడి, బహిరంగ మార్కెట్ రేటు వివరాలను రైతులను ఆయన అడిగి తెలుసు కున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్య వసాయం దండగ అన్న చంద్రబాబు ప్రభుత్వం పో యి.వ్యవసాయం పండుగలా చేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రావడంతో రైతులకు ప్రతి అడుగులోను మేలు జరుగుతుంద న్నారు. పసుపు క్వింటా మద్దతు ధర రూ.6850/- గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో కురిసిన వర్షాలకు పంట నాణ్యత స్వల్పంగా దెబ్బతినడంతో బహిరంగ మార్కెట్లో సరైన ధర పల కడం లేదని, ప్రస్తుతం రూ.5200 నుంచి రూ.5500 వరకు మాత్రమే పసుపుకు ధర పలుకుతుందన్నారు. ఈ క్రమంలో పసుపు రైతులకు మద్దతు ధర కల్పించి భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చిం దని, మార్క్ ఫెడ్ ద్వారా నాణ్యమైన పంటను కొనుగో లు చేపట్టాలని ఆదేశించిందని చెప్పారు. ఒక్కో రైతు నుంచి గరిష్టంగా 30 క్వింటాళ్లు కొనుగోలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారని, రైతులు ప్రభుత్వం ఏ ర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, ఏపీ ఆగ్రో డవల ప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, వైస్ చైర్మన్ నల్లమల్లి మురళి,హనుమంత శ్రీను, మా ర్త శ్రీనివాస్, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నా రు

## ఏపీలో డ్రోన్ ల ద్వారా భూ సర్వే :ఎమ్మెల్యే మొండితో క జగన్ మోహన్ రావు



నందిగామ జూన్ 6 ప్రజాపాలన ప్రతినిధి: పట్టణంలో ని పాత బస్టాండ్ సమీపంలో జగనన్న శాశ్వత భూహ క్కు- భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వే ను శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రా వు మంగళవారం ప్రారంభించారు.అనంతరం భూ ముల రీసర్వే వివరాలు, సర్వే కోసం వినియోగించే పరికరాలను, సర్వే ద్వారా వస్తున్న ఫలితాలను ఎ మ్మెల్యేకి అధికారులు వివరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూ వి వాదాలను శాశ్వతంగా పరిష్కరించే విధంగా ముఖ్య మంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం జగన న్న శాశ్వత భూహక్కు- భూ రక్ష పథకం ద్వారా భూ ముల రీ సర్వేకు శ్రీకారం చుట్టారని, దాదాపు 100 సం వత్సరాల తర్వాత సమగ్ర స్థాయిలో భూసర్వే జరు గుతుందని, దీనిలో పూర్తిస్థాయి ఆధునిక టెక్నాలజీ ద్వారా డ్రోన్ లను వినియోగించి, అక్షాంశాలు -రేఖాం శాలతో సహా పారదర్శకంగా సర్వే నిర్వహించి హద్దు రాళ్ళను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. తద్వారా దశాబ్దాల నాటి భూ వివాదాలు పరిష్కారం కావడం తో పాటు భవిష్యత్తులో కూడా ఎలాంటి వివాదాలు ఏర్పడకుండా పాత భూ రికార్డులను ప్రక్షాళన చేస్తూ రీ సర్వే ద్వారా కొత్త భూ రికార్డులను నమోదు చే యడం జరుగుతుందన్నారు. సర్వే వివరాలను పూర్తి గా డిజిటలైజ్ చేసి భద్రంగా ఉంచటంతో పాటు కమ టానికి గుర్తింపు నెంబర్ కేటాయించడం జరుగుతుంద న్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మ హమ్మద్ మస్తాన్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయ రాం, ఏఈ ఫణి శ్రీనివాస్, చిరుమామిళ్ల చిన్ని, పిల్లి జ యరాజు, వీఆర్వోలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు

## చల్లా ఉమేష్ వరుణ్ కు మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అభినందనలు



నందిగామ జూన్ 6 ప్రజాపాలన ప్రతినిధిపట్టణంలో నాలుగవ వార్డు కాకులయ్యబజారు నందుచల్లా విశ్వేశ్వరరావు -దేవకి దేవి ల కుమారుడు ఉమేష్ వ రుణ్ తెలంగాణ రాష్ట్ర ఎంసెట్ నందు మూడవ ర్యాంకు సాధించినందుకు మంగళవారం నాడు వారి స్వగృ హంలో మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య స్థానిక తెదేపా నేతలు తాతయ్య,నాయనమ్మ వెంకటనరసయ్య - భారతి మరియు వారి కుటుంబ సభ్యులతో కలసి శాలువాతో సత్కరించి అభినందన లు తెలియజేశారు

## కారంపూడి పంచాయతీ కార్యదర్శిగా కాసిన్యనాయక్

### ఆదేశాలు జారీ చేసిన జిల్లా అధికారులు



కారంపూడి...జూన్06...ప్రజాపాలన.. ప్రతినిధి :కారంపూడి మేజర్ పంచాయతీ కార్యదర్శిగా కే. కాసిన్యనాయక్ ను నియమిస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేసారు. కాసిన్యనాయక్ కారంపూడి మండలం మిరియాల గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. గతంలో కారంపూడిలో పనిచేసిన కాశీవిశ్వనాధం ఇక్కడ నుండి బదిలీ అవ్వటంతో ప్రస్తుతం కారంపూడి ఇంచార్జి పాలనలో కొనసాగుతుంది. గత కొంతకాలంగా కాసిన్యనాయక్ ఇంచార్జిగా వ్యవహారిస్తున్నారు. సాధారణ బదిలీలలో భాగంగా మిరియాల నుండి కారంపూడి పంచాయతీ పూర్తికాలపు కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేసారు.

## కొవ్వూరు దళితులపై దాడి.. హత్యాయత్నం..

### నిందులను అరెస్టు చేయాలి..: రెడ్ ఫ్లాగ్ డిమాండ్



విజయవాడ, ప్రజా పాలన ప్రతినిధి జూన్ 6 : తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో వాడపల్లిగ్రామ దళితులపై దాడులు, కులదూషణలు, ఆపై హత్యాయత్నం జరిగింది. పోలీసులు కేసులు నమోదు చేసి, నిందితులను కాపాడేందుకు బాధితులపై, దళితులపై తప్పుడు కౌంటర్ కేసులను నమోదు చేయడాన్ని రెడ్ ఫ్లాగ్ ఏపి కమిటీ కార్యదర్శి మరీదు ప్రసాద్ బాబు తీవ్రంగా ఖండించారు. వాడపల్లి గ్రామ దళితులకు గ్రామ పెత్తందార్లులైన కాపుల నుంచి రక్షణ కల్పించాలని రెడ్ ఫ్లాగ్ కమిటీ డిమాండ్ చేస్తుంది. దళితులపై దాడి చేసిన కాపు పెత్తందార్లను అరెస్టు చేయాలి. దళితులకు రక్షణ కల్పించాలి. దళితులపై కౌంటర్ తప్పుడు కేసులను ఎత్తివేయాలి. దళితులపై కత్తులతో దాడిచేసి, ఆపై హత్యప్రయత్నాన్ని కనుమరుగు చేసేందుకు గ్రామపెత్తందార్లు, అధికారపక్షం, పోలీసులు కౌంటర్ గా దళితులే హత్యప్రయత్నం చేశారని ఫిర్యాదులో తప్పులు చేర్చి కేసులు పెట్టి, దళితుల కేసును నీరుగార్చే ప్రయత్నాన్ని కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. ఆరోపణ నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ప్రసాద్ బాబు డిమాండ్ చశారు .

## పెద్ద కన్నలి పంచాయతీలో మరమ్మతులకు నోచుకోని వాటర్ ట్యాంక్ గేట్ వాల్



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి :తొట్టంబేడు మండలంలోని పెద్ద కన్నలి పంచాయతీ కొత్త కన్నలి గ్రామంలో వాటర్ ట్యాంక్ కింద గేటువాలు మరమ్మత్తులుకు నోచుకోకపోవడంతో తాగునీరు వృధాగా పోతున్నది. నీరు అక్కడ నిల్వ చేరడంతో పాచిపట్టి దుర్గంధ భరితంగా మారింది. వాటర్ ట్యాంక్ నీరు వృధాగా పోవడంతో గ్రామంలోకి సరిపడా తాగునీరు సరఫరా కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు అసలే వేసవికాలం ఉండడంతో తాగునీరు సరిగా రాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఉన్న నీరు కూడా వృధాగా పోతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ గేటువాలు మరమ్మతులు చేయించి వృధాగా పోతున్న నీటిని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సన్నిధి వీధిలో రేషన్ డీలర్ అవినీతి బాగోతం



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి :శ్రీకాళహస్తి..పట్టణంలోని సన్నిధి వీధిలో ఆ రెషన్ డిలర్ అవినీతి కి అడ్డు అదుపు లేకుండా పోతుంది.పట్టపగలు అందరూ చూస్తుండగా రేషన్ బియ్యాన్ని ఎగుగుమతి చేస్తున్న దృశ్యం.




# నితిన్ క్రేజీ కాంబినేషన్ పై ఇంట్రెస్టింగ్ అప్డేట్.!



మన టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ హీరోగా చేసిన చిత్రాల్లో తన కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ అండ్ క్రేజీ కం బ్యాక్ అయ్యినటువంటి "భీష్మ" కోసం తెలిసిందే. దర్శకుడు వెంకీ కుడుముల యంగ్ హీరోయిన్ రష్మికా మందన్నా కాంబినేషన్ లో అయితే వచ్చిన ఈ చిత్రం తమ కాంబినేషన్ పై సాలిడ్ హైప్ తీసుకొచ్చింది. ఇక ఈ చిత్రం తర్వాత మరోసారి వీరి నుంచి క్రేజీ ప్రాజెక్ట్ అనౌన్స్ కాగా దీనిపై మంచి అంచనాలు ఇప్పుడు నెలకొన్నాయి. ఇక ఇదిలా ఉండగా మేకర్స్ ఇంట్రెస్టింగ్ అప్డేట్ అందించారు. ప్రస్తుతం మేకర్స్ అయితే సంగీత దర్శకుడు జివి ప్రకాష్ తో ఓ సెన్సేషనల్ ఆల్బమ్ అయితే అందిస్తునట్టుగా తెలిపారు. ప్రస్తుతం జివి ప్రకాష్ అలాగే సాహిత్య రచయిత కాసర్ల శ్యామ్ అయితే కలిసి మ్యూజికల్ సిట్టింగ్స్ లో బిజీగా ఉన్నారు. మరి ప్రస్తుతం జివి ప్రకాష్ ఇస్తున్న అన్ని ఆల్బమ్స్ కూడా ఇంప్రెసివ్ గా ఉన్నాయి మరి ఈ చిత్రానికి ఎలా ఉంటుందో చూడాలి.

# నాగార్జున.. రవితేజ కోసం గోపీచంద్ సిద్ధం చేస్తున్నాడా?



మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని ఒకేసారి ఇద్దరు స్టార్ హీరోల్ని లాక్ చేయబోతున్నారా? బ్యాక్ టూ బ్యాక్ హిట్లపై కన్నేసి పక్కా ప్లాన్ తో బరిలోకి దిగుతున్నారా? 'వీరసింహారెడ్డి' ఇచ్చిన కిక్కుతో ట్రిపుల్ కిక్ షురూ చేయబోతున్నారా? అంటే అవుననే తెలుస్తుంది.'క్రాక్'..'వీరసింహారెడ్డి' సక్సెస్ లతో గోపీచంద్ మలినేని ఫుల్ స్వింగ్లో ఉన్నాడు. అయితే ఇంతవరకూ హ్యాట్రిక్ విజయాలు నయా దర్శకుడి ఖాతాలో నమోదు కాలేదు. ఇప్పుడా ఛాన్స్ కి ఒక్క అడుగు దూరంలోనే ఉన్నాడు.అందుకోసం తనకి సక్సెస్ ఇచ్చిన రవితేజనే ఆయుధంగా మలుచుకుంటున్నారు. ఇప్పటికే రవితేజ కి 'డాన్ శీను'..'బలుపు'..'క్రాక్' లాంటి భారీ కమర్శియల్ హిట్లు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ జోడీ మరోసారి చేతులు కలుపుతుందని ఇప్పటికే వార్తలొచ్చాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించడానికి ముందుకొచ్చింది. స్టోరీ కూడా లాక్ అయింది. అయితే రవితేజ డేట్లు కేటాయించాలి.ప్రస్తుతం ఆయన చేతుల్లో ఉన్న సినిమాలు పూర్తిచేసిన వెంటనే గోపీ సినిమాని షెడ్యూల్ చేసే అవకాశం ఉంది. ఈ సినిమాని హిట్ చేయగల్గితే గానీ గోపీచంద్ కెరీర్ల ఓ తొలి హ్యాట్రిక్ నమోదవుతుంది. రవితేజకి మరో బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడిగా నిలిచిపోతాడు. ఇలా గోపీచంద్ మలినేని మైండ్ లో ఓ ఐడియా రన్ అవుతుంది. అయితే మరో వైపు కింగ్ నార్జునకు అతను కథ సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే లైన్ ఒకే అయిందిట.కొన్ని రోజులుగా నాగార్జునతో అసోసియేట్ అవుతున్నారుట గోపీ. సీరియస్ గా స్టోరీకి సంబంధించిన డెవలప్ మెంట్ డిస్కషన్స్ జరుగుతున్నాయని తెలిసింది. దాదాపు స్టోర్ బౌండెడ్ గా ఓ కొలిక్కి వచ్చేసిందని సమాచారం. ఈ నెలలోనే ఈ కాంబినేషన్ కి సంబంధించి అధికారిక ప్రకటన వస్తుందని తెలిసింది.ప్రస్తుతం నాగార్జున బెజవాడ ప్రసన్న కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా ఒక్కటే నాగ్ లాక్ చేసిన అధికారిక ప్రాజెక్ట్. కాబట్టి గోపీచంద్ -కింగ్ తో సినిమా చేయడానికి ఎక్కువ సమయం పట్ట ఛాన్స్ లేదు. అన్ని అనుకున్నట్లు జరిగితే ఇదే ఏడాది ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తుంది.

# "ఉస్తాద్ భగత్ సింగ్" షూట్ పై లేటెస్ట్ అప్డేట్.!

ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రాల్లో దర్శకుడు హరీష్ శంకర్ తో చేస్తున్న పవర్ ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రం "ఉస్తాద్ భగత్ సింగ్" కూడా ఒకటి. మరి ఈ చిత్రం ఇప్పటికి కొంతమేర షూటింగ్ మాత్రమే జరిగినప్పటికీ ఫస్ట్ గ్లింప్స్ తో అయితే అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది.మరి ఇదిలా ఉండగా ఇపుడు పవన్ నుంచి మరోపక్క తన పొలిటికల్ టూర్ కూడా ప్లాన్ చేయగా ఈ లోపు అయితే పవన్ మొదట "ఓజి" షూట్ స్టార్ట్ చేయనుండగా మరి "ఉస్తాద్ భగత్ సింగ్" పరిస్థితి ఏంటి అని చాలా మంది అనుకుంటున్నారు.అయితే ఆల్రెడీ ఉస్తాద్ పై ఓ భారీ సెట్ వర్క్ జరుగుతూ ఉండగా ఈ సినిమా షూట్ పవన్ టూర్ గ్యాప్ లో స్టార్ట్ కానుంది అని తెలుస్తుంది. అయితే ఈ జూన్ నెల ఆఖరులో 26 నుంచి అలా ఉస్తాద్ భగత్ సింగ్ షూట్ లో రీస్టార్ట్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది. సో ఇలా అయితే పవన్ తన సినిమాలు షూటింగ్ లలో పాల్గొననున్నారు.




# ఏంటీ.. దసరా కంటే ఆదిపురుష్ తక్కువా?

ఈ మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సెన్సేషన్ అవుతోన్న చిత్రాల్లో యంగ్ రెబెల్ స్టార్ ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' ఒకటి. మైథాలజీ జోనర్లో రూపొందిన ఈ చిత్రాన్ని బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఓం రౌత్ తెరకెక్కించడు. అత్యంత భారీ బడ్జెట్తో విజువల్ వండర్గా రాబోతున్న ఈ చిత్రంపై బోలెడన్ని అంచనాలు ఉన్నాయి. అందుకు తగ్గట్లుగానే దీన్ని హై రేంజ్లో తీశారు.ప్రభాస్ శ్రీరాముడిగా నటించిన 'ఆదిపురుష్' మూవీని జూన్ 16వ తేదీన విడుదల చేస్తున్నారు. దీంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను ముమ్మరం చేయడంతో పాటు బిజినెస్ రిలీజ్ ఏర్పాట్లను శరవేగంగా జరుపుకుంటోంది. ముఖ్యంగా ఓవర్సీస్లో ఈ చిత్రానికి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్




కూడా ఓపెన్ అయిపోయాయి. దీంతో అంతటా ఆదిపురుష్ సందడే కనిపిస్తోంది.విజువల్ వండర్గా రూపొందిన 'ఆదిపురుష్' మూవీకి సంబంధించిన ఓవర్సీస్ బుకింగ్స్ గురించి తాజాగా ఓ షాకింగ్ న్యూస్ ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది. అక్కడ ఈ చిత్రంపై హాలీవుడ్ మూవీ 'ది ఫ్లాష్' ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఇది కూడా జూన్ 16నే రాబోతుంది. ఫలితంగా 'ఆదిపురుష్'కు చాలా తక్కువ లొకేషన్లే దొరికినట్లు సమాచారం.ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్'పై 'ది ఫ్లాష్' మూవీ ఎఫెక్ట్ ఏ రేంజ్లో ఉందన్న దానిపై ట్రేడ్ వర్గాలు ఓ ఉదాహరణను కూడా చెబుతున్నాయి. కొద్ది రోజుల క్రితం విడుదలై నాని 'దసరా' మూవీ విడుదలకు పది రోజుల ముందు 200 లొకేషన్స్ ఓపెన్ అయ్యాయి. కానీ 'ఆదిపురుష్' చిత్రానికి మాత్రం సరిగ్గా అదే పది రోజుల సమయం ఉండగా.. కేవలం 130 లొకేషన్లలోనే ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ అందుబాటులోకి వచ్చాయి. హాలీవుడ్ మూవీ నుంచి పోటీ ఉండడం వల్లే 'ఆదిపురుష్' ఒక తెలుగు సినిమాను కూడా చేరని పరిస్థితిని తెచ్చుకుందని అంటున్నారు. దీనివల్ల ఓవర్సీస్లో ప్రభాస్ సినిమాకు కలెక్షన్లు కాస్త తగ్గిపోయే అవకాశం కూడా ఉందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరి ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లు రిలీజ్ నాటికైనా లొకేషన్ల సంఖ్యను పెంచుకుంటారో లేదో చూడాలి.

# "గుంటూరు కారం" నుంచి నెక్స్ట్ భారీ షెడ్యూల్.!




సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా శ్రీ లీల మరియు పూజా హెగ్డే లు హీరోయిన్స్ గా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ లో పక్కా మాస్ మసాలా ఎంటర్టైనర్ చిత్రం "గుంటూరు కారం". మరి ఫస్ట్ గ్లింప్స్ తో అదిరే రెస్పాన్స్ ని అందుకున్న ఈ చిత్రం షూటింగ్ కాస్త స్లో గానే ఎలాంటి ఇబ్బంది లేకుండా అయితే సాఫీ గానే మేకర్స్ కంప్లీట్ చేస్తున్నారు. ఇక ఇప్పుడు అయితే మేకర్స్ ఓ భారీ షెడ్యూల్ ని ప్లాన్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది. మరి ఈ జూన్ 12 నుంచి అయితే ఈ కొత్త షెడ్యూల్ స్టార్ట్ కానుండగా చాలా లెంగ్తీ షెడ్యూల్ గా అయితే దీనిని ప్లాన్ చేస్తున్నారట. ఇక దీనితో అయితే ఆగస్ట్ లో మహేష్ బర్త్ డే కి కావాల్సిన అదిరే టీజర్ అయితే సిద్ధం అయిపోతుంది అని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా హారికా హాసిని ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

# మహేష్ సినిమాకి ఖైదీ విలన్ వాయిస్ ఓవర్!

సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో 'గుంటూరు కారం' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. టైటిల్ ప్రకటనతోనే సినిమా ఎంత మాస్ గా ఉంటుందో తెలుస్తుంది. ఇప్పటికే మహేష్ మాస్ లుక్ ఫ్యాన్స్ లో పూనకాలు తెప్పిస్తుంది. ఇలాంటి మాస్ లుక్ లో మహేష్ ఇంతవరకూ కనిపించింది లేదు. లుంగీలు ఎగ్గట్టిన సందర్భాలు..తలకు పాగాలు చుట్టిన సన్నివేశాలు చాలా సినిమాల్లో ఉన్నాయి. కానీ ఇంత ఊరమాస్ గా మాత్రం ఎలివేట్ అవ్వలేదు. ఆ రకంగా మహేష్కిది తొలి అనుభవం గానే చెప్పాలి.మహేష్ పాత్రకి ధీటుగా ప్రతి నాయకుడి పాత్రని డిజైన్ చేసారు. ఇంకా ఆ పాత్ర ఎవరు చేస్తున్నారు? అన్నది క్లారిటీ లేదు. కొంత మంది పేరున్న నటుల్ని పరిశీలించినా ఎవర్నీ ఫైనల్ చేయలేదు. మహేష్ ధీటైన



విలన్ ఎవరు? అన్న దానిపై చిత్ర వర్గాల్లో సీరియస్ డిస్కషన్ నడుస్తుంది. ఈ నేపథ్యంలో సినిమాకి సంబంధించి మరో ఇంట్రెస్టింగ్ అప్ డేట్ అందింది. ఇందులో ఓ ఫేమస్ వాయిస్ వినిపించనుందని సమాచారం. ఇటీవలి అతని వాయిస్ తెలుగలో ఓ రేంజ్ లో వైరల్ అయింది.కేవలం వాయిస్ తోనే పాపులర్ అయిపోయాడు. ఆ వాయిస్ కి ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఉందంటే? అతిశయోక్తి కాదు. అందుకే త్రివిక్రమ్ తెలివిగా అలాంటి కంఠాన్ని దించుతున్నట్లు కనిపిస్తుంది. ఇంతకీ ఆ వాయిస్ ఎవరిది? అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. అతనే అర్జున్ దాస్. ఖైదీ సినిమాలో విలన్ గా నటించిన తమిళ నటుడు అర్జున్ దాస్. సినిమాలో సీరియస్ యాక్షన్ మోడ్ లో సాగే ఆ పాత్రతో పాటు వాయిస్ అంతే హైలైట్ అయింది.సినిమాలో అర్జున్ దాస్ వాయిస్ యూనిక్ ఫీల్ ని తీసుకొచ్చింది. ఆ సినిమా తర్వాత మంచి అవకాశాలు వచ్చాయి. ఇటీవలే 'బుట్టబొమ్మ' సినిమాలో మెయిన్ లీడ్ సైతం పోషించాడు. దీంతో తెలుగింట మరింత పాపులర్ అయ్యాడు. ఇదంతా అర్జున్ దాస్ వాయిస్ తోనే సాధ్యమైంది. ఇప్పుడదే వాయిస్ గుంటూరు కారం స్టోరే నేరెటర్ గా తీసుకెళ్లిందని సమాచారం. బ్యాక్ గ్రౌండ్ లో స్టోరిని నేరేట్ చేసే బాధ్యతలు త్రివిక్రమ్ అర్జున్ దాస్ కి అప్పగించినట్లు విశ్వసనీయ సమాచారం. మరి ఇందులో నిజం ఎంతో తెలియాలి. ఇలాంటి యూనిక్ వాయిస్ లు పట్టుకోవడం త్రివిక్రమ్ స్పెషాల్టీ. తన సినిమాలకు బ్యాక్ గ్రౌండ్ లో వాయిస్ ఓవర్ కీలకంగా ఉంటుంది. కొన్ని సినిమాల కోసం సూపర్ స్టార్లనే రంగంలోకి దించిన సంగతి తెలిసిందే.

జై భీమ్

బహుజనులు అంటే ఎవరు?
ఈ దేశం బాగుండాలని కోరుకునే ప్రతి ఒక్క మైనారిటీ SC,ST,BC,OC కులాల్లో ఉన్న ప్రజలందరు బహుజనులే

ఏకైక లక్ష్యం బహుజన రాజ్యాధికారం సాధించడమే

ఆలోచించండి!
➤2016 లెక్కల ప్రకారం నేషనల్ శాంపిల్ సర్వే (NSSO ) వారు కులాల జనాభా నిష్పతి
➤BC 41%,SC 20%, ST 9%, OC 30%
➤ప్రస్తుతం అనుభవిస్తున్న రిజర్వేషన్స్ BC 27%, SC15.5%,ST 7.5%, OC 50%
ఆలోచించండి!
రిజర్వేషన్ కావాలా? రిప్రజెంటేషన్ కావాలా?
జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్స్ కావాలని ప్రతిపాదిస్తుంది

50% రిప్రజెంటేషన్
మహిళలకు 50% రిప్రజెంటేషన్ (రిజర్వేషన్స్) కల్పించడమే మా ధ్యేయం

బీసీలను సీఎం చెయ్యాలి
డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ చెప్పిన మాస్టర్ కీ ని సాధించడమే మా నినాదం
అధిక జనాభా ఉన్న BCని CM చేయాలనేది లక్ష్యం

మనం గెలవాలంటే MAM ను ఆచరించాలి
MAM అంటే
M : ఆశయా లకు, నీకు ,మద్దతు ఇచ్చే వాళ్ళని మెంబర్స్ గా చేసుకోవాలి, నిన్ను ఇష్టపడే వాళ్ళని నాయకుడిగా నామినేట్ చేయాలి
A : నిన్ను నీ కమిటీలను కాపాడటానికి అడ్వకేట్స్ కమిటీని పెట్టాలి
M : నిన్ను ప్రపంచానికి పరిచయం చేసి నాయకుడుగా గెలిపించడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మీ చేతిలో ఉండాలి

5 లక్షల జనాభా ఉన్న ప్రతి కులం నుండి MLA గా MLC గా ఉండాలని సమర్ధిస్తుంది

కుల రహిత సమాజం
డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ కోరుకున్న కులరహిత సమాజం కోరకు కులాంతర వివాహం చేసుకున్న వారి పిల్లలకు మరియు కులం వద్దు అనేవారికి సమతా కులం అని నమోదు చేయటానికి మద్ధతు.

శివ భాగ్య రావు బహుజన్,IRS-vrs
నేషనల్ కన్వీనర్

పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)
జై పూలే జై భీమ్ జై బహుజన్ జై భారత్

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com